


రైల్వే జీఎం శ్రీవాస్తవతో చర్చిస్తున్న ఎంపీ పురందేశ్వరి

చల్లంగ చూడమ్మా..మోదకొండమ్మ


బోనాలతో మహిళల ఊరేగింపు

కోరుకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో మాత్రమే ఎక్కువగా కనిపించే ఆషాఢ మాస బోనాల ఉత్సవం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని సుమారు 100 మంది ఆడపడుచులు మంగళవారం బోనాలు తలపై ఎత్తుకుని మేళతాళాలు,మంగవాయిద్యాలతో గ్రామం అంతా ఊరేగారు. మోదకొండ ఆలయం వద్ద బోనాలు దించారు. చల్లంగ చూడమ్మా తల్లి అంటూ వేడుకున్నారు. మోదకొండమ్మ కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని.ప్రజలంతా సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుతూ ప్రతి సంవత్సరం ఈ బోనాలు ఉత్సవం నిర్వహిస్తామని గ్రామ సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి మోదుకొండమ్మ బోనాలు ఎత్తుకుంటున్నారు. ఈ ఏడాది కూడా ఆమె బోనాలు ఎత్తుకుని గ్రామమంతా కలియతిరిగారు. ఎక్కడెక్కడో ఉన్న ఆడబడుచులు గ్రామానికి చేరుకోవడంతో ఊరంతా సందడిగా మారింది.

నిధులు తెచ్చినా.. టెండర్లు ఎందుకు పిలవలేదు..

రైల్వే జీఎం శ్రీవాస్తవను ప్రశ్నించిన ఎంపీ పురందేశ్వరి

- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక
- సమయం లేదని కలిసిన ఎంపీ
- పుష్కరాలకు పనులవ్వాలని సూచన
- కొవ్వూరులో రైలు హాల్ట్‌లపై విన్నపం
- పలు అభివృద్ధి పనులపై చర్చ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.271 కోట్ల నిధులు మంజూరు చేసి ఆరు నెలలు అవుతున్నా ఇంకా టెండర్లు ఎందుకు పిలవలేదని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సికింద్రాబాద్‌లోని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కలిసి ఆరా తీశారు. ఆంధ్రజ్యోతిలో మంగళ వారం పుష్కరాల నేపథ్యంలో రైల్వే పనుల్లో కదలిక లేదంటూ ప్రచురితమైన 'సమయం లేదు మిత్రమా' అనే కథనంపై ఆమె స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ పురందేశ్వరి సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవను కలిశారు. 2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమండ్రి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణీకులకు అందుబాటులోకి తేవాలని కోరారు. పార్లమెంట్ పరిధిలోని పలు రైలు అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు వెంటనే టెండర్లు పిలవాలని, పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. గోదావరి, కొవ్వూరు రైల్వేస్టేషన్లలో టాయిలెట్స్ వంటి సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. నిడదవోలు జంక్షన్‌లో రూ.150 కోట్లతో చేపట్టిన ఎలక్ట్రిఫికేషన్ పనులు, 4, 5 ప్లాట్‌ఫాం పనులు పూర్తయినా మెయిన్‌లైన్‌లో కలపడానికి అవసరమైన రూ.6 కోట్లను విడుదల చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. కొవ్వూరు-భద్రాచలం రైల్వే ప్రాజెక్టు 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడం, సర్వే జరిగినప్పటికీ పనులు పూర్తవలేదనే విషయాలను ఎంపీ ప్రస్తావించారు. వీటిపై రైల్వే జీఎం శ్రీవాస్తవ స్పందిస్తూ రాజమండ్రి ప్రధానరైల్వే స్టేషన్ అభివృద్ధికి సంబంధించిన పనులకు రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలిచి మొదటి దశ పనులను వెంటనే ప్రారంభిస్తామని వెల్లడించారు. కొవ్వూరు-భద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటా నిధులివ్వాల్సి ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం వల్ల సత్తుపల్లి వరకూ పనులు చేశామని, ఏపీ ప్రభుత్వం కూడా ఇస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తామని జీఎం వివరణ ఇచ్చారు. ఎంపీ పురందేశ్వరి వెంట రైల్వే యూనియన్ నాయకుడు ఉన్ని కృష్ణన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కొవ్వూరు బీజేపీ కౌన్సిలర్ పీఎం కృష్ణ ఉన్నారు.



కొవ్వూరులో రైళ్లకు హాల్ట్ ఇవ్వండి

కొవ్వూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కరోనాకు ముందు వరకూ కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 18 రైళ్లు ఆగేవని, ఇప్పుడు 8 రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని, ముఖ్యంగా చెన్నయ్, తిరుపతి వెళ్లే రైళ్లతోపాటు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూడా ఆగడం లేదని ఎంపీ పురందేశ్వరి ప్రస్తావించారు. రైళ్లకు తిరిగి హాల్ట్‌లను పునరుద్ధరించాలని జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు బీజేపీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019లో 34 రైళ్లకు హాల్ట్ ఉండేదని, కొవిడ్ సమయంలో రైళ్ల హాల్ట్‌లను పూర్తిగా నిలిపివేయడంతో కొవ్వూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాలకు సంబంధించి 100కు పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 2019 నాటి రైళ్లకు హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. అనపర్తి, నిడదవోలు స్టేషన్లలో జన్మభూమికి హాల్ట్ కల్పించాలని కోరారు.





పైసా మే పట్టా

ఫీజులుం!

ఫీజు బకాయి కట్టండి.. సర్టిఫికెట్లు పట్టుకెళ్లండి..

రూ.1140 కోట్లుపైనే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు రూ.వెయ్యి కోట్ల వరకు పేరుకుపోయాయి.గత వైసీపీ హయాంలో రూ.600 కోట్ల వరకూ ఉన్నాయి.. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.540 కోట్లు బకాయి ఉంది. దీంతో సర్టిఫికెట్లు ఆపి విద్యార్థుల నుంచి బాకీలు కట్టించుకోవాల్సి వస్తుందని యాజమాన్యాలు అధికారులకు సంజాయిషీ ఇస్తున్నాయి.ప్రధానంగా కాకినాడ జిల్లా మెట్టప్రాంతంలో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీకి ఫీజు రీయిం బర్స్‌మెంట్ బాకీలు సెకండ్ ఇయర్ నుంచి ఫైనలియర్ విద్యార్థులవి కలిపి రూ.90 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. దానికి సమీపంలో ఉన్న మరో కాలేజీకి రూ.15కోట్ల వరకు పేరుకుపోయాయి.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు భారీ ఇంజనీరింగ్ కాలేజీల బకాయిలే రూ.240 కోట్ల వరకు ఉన్నాయి. ఇవికాక మధ్యస్తంలో ఉండే పది కాలేజీల బకాయిలు రూ.150 కోట్లు, మిగిలిన మరో పది కాలేజీల బకాయిలు రూ.60 కోట్ల వరకు ఉన్నాయని ఆయా యాజమాన్యాలు వివరిస్తున్నాయి.

- కాలేజీ యాజమాన్యాల పట్టు
- ఇంజనీరింగ్ విద్యార్థుల ఇక్కట్లు
- రూ.1140 కోట్ల ఫీజు బాకీలు
- ఉద్యోగాలకు ప్రయత్నాలు
- సర్టిఫికెట్లు ఇవ్వడానికి ససేమిరా
- బాకీలు చెల్లించాలని డిమాండ్
- జమకాని ఫీజు రీయింబర్స్‌మెంట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను నిండా ముంచేసింది. నాడు ఫీజులు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టింది. ఆ పాపం ప్రస్తుత ప్రభుత్వానికి చుట్టుకుంది. దీంతో సుమారు ఒక్క ఇంజనీరింగ్ కాలేజీలకే సుమారు వెయ్యి కోట్ల వరకూ ఫీజు బకాయిలు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది మంది ఇంజనీరింగ్ విద్యా ర్థులకు కాలేజీలు చుక్కలు చూపిస్తున్నాయి. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయి. ఫీజు బకాయి చెల్లించేవరకు వాటిని ఇవ్వబోమంటూ సతాయిస్తున్నాయి. సకాలంలో తమ సర్టిఫికెట్లను కంపెనీలు, ఇతర విద్యాసంస్థలకు ఇవ్వకపోతే అవకాశాలు పోతాయని మొత్తుకుంటున్నారు. అటు కాలేజీ యాజమాన్యాలేమో తమకు ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోవడంతో విద్యార్థులే చెల్లించాలని తెగేసి చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.540 కోట్ల వరకు ఉన్నాయి. ఇది కాకుండా గత వైసీపీ హయాంలో 600 కోట్లు వరకూ బాకీలు ఉండడం గమనార్హం.

బకాయిలు..ముప్పుతిప్పలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జేఎన్టీయూ పరిధిలో మొత్తం 28 వరకు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఇందులో పది కాలేజీలు ఒక్క కాకినాడ జిల్లాలోనే ఉన్నాయి. మిగిలిన 18 కాలేజీలు కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్నాయి. మొత్తం 28 కాలేజీల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు 12 వేల మంది ఉన్నారు. విద్యార్థుల్లో అనేక మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు లభించాయి. కొందరేమో ఉన్నత చదువులకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్లు ఉండాలి. తీరా ఇప్పుడు ఇంజనీరింగ్ చదివిన కాలేజీలు వీటిని ఇవ్వ కుండా ఇబ్బంది పెడుతుండడంతో లబోదిబో మంటున్నారు. కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వొద్దని తెగేసి చెప్పేయడంతో ఎంత బతిమాలినా సిబ్బంది వీటిని ఇవ్వడం లేదు. దీంతో కొందరు అత్యవసరం అనుకున్న విద్యార్థులు అప్పులుచేసి ఫీజులు కడుతున్నారు. లేదంటే ఉద్యోగం పోతుందనే భయంతో బాకీలు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొన్ని కాలేజీలు తమ బకాయిలకు రాజధానిలో ఉన్న తాధికారులతో మాట్లాడుతున్నా స్పందన ఉండడం లేదు. పోనీ బాకీలు వేగంగా వస్తే సర్టిఫికెట్లు ఇవ్వాలని భావిస్తున్నా అది జరగడం లేదు. మరోపక్క బాకీలు రాకుండా సర్టిఫికెట్లు ఇచ్చేస్తే నష్టపోతామని భావిస్తున్నాయి. ప్రభుత్వం మారాక ఒక వాయిదా బాకీలు కాలేజీలకు అందాయి. ఇంకా మిగిలినవి రావాల్సి ఉందని చెబుతున్నాయి.అయితే ఫైనలియర్ విద్యార్థులు నాలుగు నుంచి ఐదు వాయిదాల వరకు బాకీలు చెల్లించాల్సి ఉందని చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం నానాపాట్లు పడుతున్నారు. కొందరైతే ప్రభుత్వం నుంచి రావాల్సిన రీయంబర్స్‌మెంట్ డబ్బులు మినహా మిగిలినవన్నీ చెల్లిస్తామని కాలేజీలను ప్రాధేయపడుతున్నాయి. కానీ యాజమాన్యాలు మాత్రం ససేమిరా అంటున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక విద్యార్థులు తలలు పట్టుకున్నారు. ఇంతకాలం ఎంతో కష్టపడి చదివి చివరిలో ఇదేంటిరా అంటూ తలలు బాదుకుంటున్నారు. కొన్ని కాలేజీలైతే మరీ దారుణంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు ఎంపికైన విద్యార్థులను సైతం బకాయిల పేరుతో వేధిస్తుండడంతో వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. ప్రభుత్వం మారాక నేరుగా కాలేజీల ఖాతాల్లోనే జమవుతున్నాయి.


రాజానగరం రావులచెరువు గట్టున కొలువు తీరిన శ్రీగోగులమ్మ మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. - రాజానగరం


నిడదవోలులో ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రైతులకు నష్టం లేకుండా పనులు చేయండి

ఆర్‌వోబీ పరిశీలనలో కలెక్టర్

నిడదవోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా ఆర్వోబీ నిర్మాణ పనులు చేయా లని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. నిడదవోలు పట్టణంలో గోదావరి కెనాల్ రోడ్డులో జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనులను మంగళవారం ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారు లతో కలిసి ఆమె పరిశీలించారు. ఎక్స్‌పర్ట్ కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి రైతాంగానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతిపాదించిన అంశాలపై నివేదిక అందజేయాలని సూచించారు. ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేసే క్రమంలో రైతులు వెల్లడిస్తున్న అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కరమార్గం చూపాలన్నారు. దారవరం గ్రామానికి చెందిన రైతులు పంట పొలాలు ముంపునకు గురవుతాయని ముంపునకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారని అన్నారు. రైతాంగానికి మేలు చేసే క్రమంలో భూ సమతుల్యత, ఎత్తుపల్లాలను గుర్తించి తగిన నివేదిక అందజేయాలన్నారు. ఎర్రకాలువ వరద వచ్చినప్పుడు ముంపు ప్రమాదం నేపథ్యంలో పరిష్కారానికి అధికారులు ఇచ్చే సూచనలు అనుసరించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణుల బృందం ఆర్డీవో, రైల్వే ఇంజనీర్స్, ఇరిగేషన్ ఎస్ఈ, జిల్లా వ్యవసాయ శాఖాధికారులతో కలసి మరొకసారి వాస్తవ పరిస్థితులను అంచనా వేయవలసి ఉంటుందన్నారు. ఆమె వెంట ఆర్డీవో రాణీ సుస్మిత,జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్. మాధవరావు, ఆర్అండ్‌బీ ఈఈ రూప్ కుమార్, డీఈ వెంకటరమణ ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద శాంతియుత ధర్నా చేస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

పెన్షనర్ల నిరసన

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తూర్పు గోదావరి జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు బొమ్మూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కార సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం శాంతియుతంగా ధర్నాలు చేశామన్నారు. ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నగర యూనిట్ అధ్యక్షుడు కెకె.సంజీవరావు,సహాధ్యక్షుడు కొండపల్లి సుబ్రహ్మణ్యం, కెఎస్ఈఎస్.రాజు,ఎండీ అక్బర్, అడ్డా వీరవెంకటరాజు,ప్రసాద్, ఎం.జానకి రామయ్య,200 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

దొంగా.. పోలీస్!



గోదాట్లో ఏం జరుగుతుందనేది జనమెరిగిన సత్యమే.. అయినా మన అధికారులు మాత్రం దొంగా పోలీస్ ఆటాడేస్తారు.. సమన్వయంతో పనిచేస్తే గోదాట్లో ఇసుకను ఆపలేరా..? కానీ అలా చేయడంలేదు.. మామూళ్ల మత్తులో మునిగి తేలుతూ ఇష్టానుసారం అక్రమార్కులకు అండగా నిలబడుతున్నారు.. అధికార పక్షం నాయకులు వంతపాడుతున్నారు.. వైసీపీ నాయకులతో కుమ్మక్కవుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. అయినా పట్టుకునేవారెవరు!

ఇసుకాసురులను పట్టుకోని వైనం

- ఇష్టానుసారం ఇసుక డ్రెడ్జింగ్
- అధికారులకు కానరాదు
- పట్టుకున్నా కేసు నమోదు కాదు
- అధికారుల మధ్య లేని సమన్వయం
- ఆర్‌కే కనుసన్నల్లోనే దందా
- అందరికీ మామూళ్లే

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని ఓ చారిత్రక నిర్ణయం తీసుకుంటే.. సొంత పార్టీ నేతలు,అధికారులే దానికి తూట్లు పొడుస్తున్నారు.వైసీపీ హయాంలో ఇసుకను అక్రమంగా దోచేసిన దొంగలతో కుమ్మక్కవడం మరో ఘోరం. అనధికారికంగా డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక తోడేసి దోపిడీ కొనసాగిస్తున్నారు. ఉద్యోగాల భద్రత గుర్తొచ్చి అప్పుడప్పుడు టాస్క్‌ఫోర్స్ కొన్ని డ్రెడ్జింగ్ పడవలను పట్టుకుంటే.. వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఇరిగేషన్ అధికారులు, కేసులు నమోదు చేయడానికి పోలీసులు వితండవాదన చేయడం గమనార్హం.ఈ నెల 8వ తేదీన 5 డ్రెడ్జింగ్ బోట్లను పట్టుకుంటే సోమ వారం కేసు నమోదు చేయడం గమనార్హం.

గోదారిలో బోట్లు ఎన్ని?

గోదావరిలో బోటు దిగాలంటే గతంలో ఇరిగేషన్ అధికారులు లైసెన్స్ ఇచ్చేవారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో పోర్టు అధికారుల అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టింది. తనిఖీలు, లైసెన్స్‌ల అధికారం పోర్టుకే ఇచ్చింది. కానీ వాళ్లెవరూ కనీసం తనిఖీలకు రారు. ఎన్ని పడవలకు అనుమతిచ్చారో చెప్పరు. అనధికారికంగా డ్రెడ్జింగ్ బోట్లు తిరిగేస్తుంటే పట్టించుకోరు. దీంతో గోదావరిలో ఎన్నిబోట్లు ఇసుక తీస్తున్నాయో..అవి ఎవరివో కూడా లెక్కాపత్రం లేదు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బోట్లు ఇరిగేషన్ ఏఈ కస్టడిలో ఉన్న సంగతి తెలిసిందే.

సొసైటీల ముసుగులో డ్రెడ్జింగ్

అఖండ గోదావరిలో డీసిల్టేషన్‌కు ప్రభుత్వ అనుమతి ఉంది. బోట్స్‌మన్ సొసైటీల ద్వారా మాన్యువల్‌గా గోదావరి నుంచి ఇసుక తీయాలి.అందుకు బోట్స్‌మన్ సొసైటీకి టన్నుకు రూ.219 ఇస్తారు.కానీ కొందరు ఇసుక వ్యాపారులు,ప్రజా ప్రతినిధులు కుమ్మక్కయి,కొందరు అధికారులను గుప్పిట్లో పెట్టుకుని గత వైసీపీలో ఇసుక అక్రమాలు చేసి రూ.కోట్లు గడించిన ఆర్కే అనే వ్యక్తికి మళ్లీ ఇక్కడ పెత్తనం అప్పగించారు. దీంతో బోట్స్‌మన్ సొసైటీల పేరుతో డ్రెడ్జింగ్ మొదలైంది. గుంటూరు, విజయవాడ, భీమడోలు, విజ్జేశ్వరం ప్రాంతాలకు చెందిన సుమారు 70 డ్రెడ్జింగ్ బోట్లు గోదావరిలో అక్రమ డ్రెడ్జిం గ్‌కు పాల్పడుతున్నాయి. సుమారు 3 నెలల నుంచి డ్రెడ్జింగ్ చేస్తున్నారు. సాధారణ బోట్లలో పది యూనిట్ల వరకూ ఇసుక వస్తుంది. ఒక రాత్రి డ్రెడ్జింగ్ చేస్తే వందల టన్నుల ఇసుక వచ్చేస్తుంది. దీనిని తెచ్చి బోట్స్‌మన్ సొసైటీల్లోనే అన్‌లోడ్ చేస్తున్నారు..వారికివ్వాల్సింది వారికిచ్చే స్తున్నారు.పగటి పూట లంకల్లో లేదా, కొవ్వూరు, గాయత్రి, కోటిలింగాల, కాతేరు ప్రాంతాల్లో డొం కల్లో డ్రెడ్జింగ్ పడవలను తాళ్ల తో కట్టేసి రాత్రికి మళ్లీ డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్నారు.

ఎట్టకేలకు కేసులు నమోదు

ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు టూటౌన్ పోలీసులకు అక్రమ డ్రెడ్జింగ్ బోట్ల గురించి ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ ఏఈ శివ ప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు సీఐ శివగణేష్ తెలిపారు. గాయత్రి ర్యాంపుల్లో దొరికిన ఐదు డ్రెడ్జింగ్ బోట్లపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. లలితాదేవి బోటులో ఆపరేటర్ ఘంటసాల ఏసు, బాలే రామ్మూర్తిపై కేసు నమోదైంది. శ్రీలక్ష్మీగణపతి వీరచంద్రయ్య డ్రెడ్జింగ్ బోటు యజమానిగా గుంటూరు జిల్లా ధరణికోటకు చెందిన యళ్లమూడి వెంకటరావు, శ్రీ లక్ష్మీ గణపతి డ్రెడ్జింగ్ బోటు యజమానిగా సీతంపేటకు చెందిన సంగీత వెంకటావు, సద్గురు సాయినాథ్ బోట్ యజమానిగా కొవ్వూరుకు చెందిన కొత్తపల్లి బాలాజీ, శ్రీలక్ష్మీ డ్రెడ్జింగ్ బోటు యజమానిగా యాళ్లమూడి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు అయింది. కోటిలింగాల, కాతేరులో దొరికిన డ్రెడ్జింగ్ బోట్లపై ఇంకా కేసు నమోదు కాలేదు. త్రీటౌన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో ఇక్కడ కూడా కేసు నమోదయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు యజమానులు ముందుకొస్తున్నట్టు సమాచారం.

టన్నుల కొద్దీ అవినీతి

ఈ ఇసుక వ్యవహారం అంతా ఆర్కే అనే వ్యక్తి చేతుల మీదుగా జరుగుతుంటుంది. అతని నుంచి ఎవరి వాటా వారికి వెళ్లిపోతుంది. కొందరు ప్రజాప్రతి నిధులకు 20 టన్నుల లారీకి రూ.3800 వందలు అందుతున్నట్టు ప్రచారం. ఇలా రోజుకు సుమారు 5 లక్షల వరకూ కొందరికి అందే అవకాశాన్ని సదరు ఆర్కే కల్పించినట్టు ప్రచారం ఉంది. 20 టన్నుల లారీకి సుమారు 25 నుంచి 35 టన్నుల వరకూ ఇసుక అదనంగా వేస్తున్నారు. 20 టన్నుల లారీ అంటే 20 టన్నుల ఇసుకకే బిల్లు ఉంటుంది.మిగిలి నది ఎవరికి వారు దండుకుంటున్నారు. అధికలోడు వల్ల రోడ్ల మీద ఇసుక పడిపోవడం, దుమ్ము రేగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.



వెలుగుల 'సన్'తోషం!

» అదే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం లక్ష్యం
» ఉమ్మడి జిల్లాలో అమలుకు విద్యుత్ శాఖ కసరత్తు
» సబ్సిడీతో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

విద్యుత్ వినియోగదారులను కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి. జేబులను గుల్లచేస్తున్నాయి. నెలనెలా బిల్లులు చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడేవారి సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం విద్యుత్ వినియోగదారులకు ప్రత్యామ్నాయంగా మారింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అధికంగా విద్యుత్ వినియోగించే వారికోసం కేంద్రం ప్రవేశపెట్టిన పథకమిది. దీనికి అందరూ అర్హులే. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు అందరికీ ఈ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్‌లను ప్రభుత్వమే ఏర్పాటు చేయనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఉదాహరణకు కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 50,801 మంది ఉచిత విద్యుత్ పొందుతున్నారు. వీరిలో 25,275 మంది ఇళ్లకు రూఫ్‌టాప్‌లు ఉన్నాయి. మిగిలిన 25,256 మంది ఇళ్లపై ప్యానళ్ల ఏర్పాటుకు అవకాశం లేకపోవడంతో వీరి కోసం ప్రత్యేకంగా ఆయా గ్రామాల పరిధిలో స్థలాలు ఏర్పాటుచేసి ప్లాంట్లు నెలకొల్పనున్నారు. అందుకోసం సుమారు వంద ఎకరాలు అవసరమని గుర్తించి 80 ఎకరాలు సేకరించారు. అదేవిధంగా స్వచ్ఛందంగా ఈ పథకం కింద సోలార్ కనెక్షన్లు పెట్టుకునేవారి సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. గతేడాది ఆగస్టులోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ వేలాది సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖాధికారులు చర్యలు చేపట్టారు.

బీసీ, ఓసీ, ఇతర వర్గాలకు..

ఈ రెండు వర్గాలకు సబ్సిడీపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. బీసీలకు ఒక కిలో వాట్ యూనిట్‌కి రూ.65 వేల ఖర్చుతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ఇందులో రూ.30 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. రెండు కిలో వాట్ యూనిట్‌కి రూ.1.30 లక్షలు ఖర్చయితే రూ.60 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. మూడు కిలో వాట్ల యూనిట్‌కు రూ.2లక్షలు ఖర్చవుతుంది. అందులో రూ.75 వేల సబ్సిడీ ఉంటుంది.

ఇదే మంచి త'రుణం'..

పేద కుటుంబాలు ఎవరైనా ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ ఏర్పాటు చేయదలచుకుంటే దానికి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ఆఫర్ ప్రకటించారు. ఈ యూనిట్ విలువ రూ.65 వేలు. ఇందులో అందులో డ్వామా స్త్రీనిధి ద్వారా రూ.6 వేలు, బ్యాంకు రుణం రూ.59 వేలు ఇస్తారు. రూ.59 వేలులో సబ్సిడీ రూ.30 వేలు ఉంటుంది. అంటే చివరికి చెల్లించాల్సింది రూ.29 వేలు మాత్రమే. దీనిని కూడా వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. ఇది ఎస్సీ, బీసీ, ఓసీ అన్ని వర్గాలకు వర్తిస్తుంది.

ఇలా చేస్తున్నారు...

కాకినాడ జిల్లాలో మొత్తం ఏడు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు ఐదు లక్షల వరకు ఉన్నాయి. కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేటల్లో సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు 6,792 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 2,200 మంది 6,200 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. వీరిలో 1,776 మంది గృహాలపై 6,140 కిలోవాట్ల మేర ఫలకాలు ఏర్పాటు చేశారు. కాకినాడ డివిజన్‌లో 1,070, పెద్దాపురం డివిజన్‌లో 473, జగ్గంపేట డివిజన్‌లో 233 కనెక్షన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు 40 మంది ప్రైవేటు ఏజెన్సీ టీమ్‌ను అప్పగించారు. ఈ టీమ్ వారికి కేటాయించిన మండలాల్లో ఈ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనుంది. ఒక కిలో వాట్‌కు ఒక రోజుకి ఐదు యూనిట్లు వస్తుంది. నెలకు 150 యూనిట్ల విద్యుత్ వినియోగించుకోవచ్చు. ఒక్కసారి సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లపాటు వాటి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారులకు మేలు..



సూర్యఘర్ పథకంతో లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. విద్యుత్‌చార్జీల నుంచి ఉపశమనం దక్కుతుంది. ఒకకిలోవాట్ సామర్థ్యంతో సోలార్‌ప్యానల్ ఏర్పాటుచేస్తే రోజుకు ఐదు యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. అంటే నెలకు 150 యూనిట్ల విద్యుత్ వినియోగించుకోవచ్చు. రెండు, నుంచి మూడు కిలోవాట్ల యూనిట్లయితే నెలకు 300 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. గృహ అవసరాలకు 200 యూనిట్లు వాడగా మిగిలింది ప్రభుత్వం కొంటుంది. **-ఉదయభాస్కర్, డీఈ (ఆపరేషన్స్), ఈపీడీసీఎల్, కాకినాడ**

జేఎన్టీయూకేలో నేడు.. యూసీఈకే ఓక్ ఉత్సవాలు

» ముఖ్యఅతిథిగా సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు, ప్రొఫెసర్ అగర్వాల్
» గౌరవ అతిథిగా యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్
» యూసీఈకే 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహణ



జేఎన్‌టీయూకేలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్

జేఎన్టీయూకే, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలో బుధవారం యూసీఈకే ఓక్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. కాకినాడ నగరంలో 1946లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించారు. 2025, జూలై 16 నాటికి కళాశాల 79ఏళ్లు పూర్తిచేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఓక్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు యూసీఈకే కళాశాల ప్రతిష్ఠను తెలియజేయనున్నారు. ఏడాదిపాటు అనగా 2025, జూలై 16 నుంచి 2026, జూలై 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికను సిద్ధం చేశామన్నారు.

ఓక్ ఉత్సవాలను బుధవారం ప్రారంభించనుండగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీలోని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకేఅగర్వాల్ పాల్గొంటున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ప్రత్యేక అతిథులుగా పూర్వవిద్యార్థులు ఐఐటీమద్రాస్ నుంచి సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం, బెంగళూరులోని ఎక్స్ఐఎంఈ పరిశోధనా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కే భట్టా, ఇన్వెకాస్ చైర్మన్ దశరథ్ గుడే హాజరుకానున్నారు. జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. వర్సిటీలో అభ్యాసం, సాంకేతికత, సామాజిక బాధ్యతపట్ల స్ఫూర్తి కల్పించడం, పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య బంధాలను మరింత బలపరచడం, వివిధ రంగాల్లో విజయాలు సాధించిన పూర్వవిద్యార్థులను సత్కరించడంతోపాటు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

ఏడాది చివరి నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

» మంత్రి నారాయణ

సామర్లకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీకి నోచుకోని టిడ్కో ఇళ్ల సమస్యలన్నింటినీ ఈఏడాది చివరిలోగా పరిష్కరించి లబ్ధిదారులకు అప్పగించేందుకు అన్ని చర్యలు చేపట్టామని రాష్ట్ర మున్సిపల్ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ వెల్లడించారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మంగళవారం రాత్రి ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 7లక్షలమంది టిడ్కో గృహాల అప్పగింత కోసం ఎదురుచూస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను నిర్వీర్యం చేసిన కారణంగా వారి హయాంలో చెల్లించాల్సిన రూ.160కోట్లను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి బ్యాంకులకు చెల్లించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలన్నింటినీ త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. సామర్లకోట, పెద్దాపురం మున్సిపాల్టీల్లో చెరొక రూ.35కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చినరాజప్ప సూచనలకు ఆమోదం లభించిందన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియలు పూర్తయి పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకలతో ఆర్థికశాఖ పూర్తిగా ఛిన్నాభిన్నమైందన్నారు. అయినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తు.చ తప్పకుండా అమలు చేసుకుంటూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే సుపరిపాలన అందించామన్న తృప్తిని పొందామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

వెంకన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి శనివారం వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధశాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో శ్రీకర్ అధ్యక్షతన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, సీఐ విద్యాసాగర్, దేవదాయశాఖ డీఈ ఉదయకుమార్, ఇంజనీరింగ్ బృందంతో కలిసి క్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. గత శనివారం సుమారు 70వేల మంది భక్తులు తరలివచ్చారని ప్రతి శనివారం భక్తులు పెరిగే అవకాశం ఉందన్నారు. భక్తులకు స్వామి వారి దర్శనం, తాగునీరు, వివిధ సౌకర్యాలు, అన్నప్రసాదం సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. భద్రత ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు చేశారు. ప్రతిభక్తుడు స్వామివారిని సంతృప్తిగా దర్శనం చేసుకుని వెళ్లాలని అసౌకర్యాలు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయనసూచించారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, రోడ్లు, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.


వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు

వెంకన్న ఆదాయం రూ.3.15లక్షలు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,15,209 లభించినట్లు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

శాకంబరిగా పెద్దాపురం మరిడమ్మ



భక్తుల కొంగు బంగారం అయిన పెద్దాపురం మరిడమ్మను ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు రకాల కూరగాయలు, ఆకు కూరలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)


ఆయోధ్యలో పర్యటిస్తున్న పీఏసీ బృందం

సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి ప్రణాళికలు

» డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి (పీఏసీ), సీనియర్ అధికారులు మార్గయాత్రలో భాగంగా ఉత్తర ప్రదేశ్‌లోని ఆయోధ్య డీసీసీబీని సందర్శించారు. సహకార రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం, వాటి అమలులో విజయవంతమైన మార్గాలను తెలుసుకోవడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ సందర్శన కొనసాగుతోందని బాబు తెలిపారు. గతంలో నష్టాలను చవిచూసినా ప్రభుత్వం పారదర్శక విధానాల అనుసరణ ద్వారా నష్టాల ఊబి నుంచి బయటపడుతున్నామని ఆయన చెప్పారు. ఆర్థిక పునరుద్ధరణ, స్వతంత్ర ప్రణాళికలు, ఆదాయ మార్గాలను విస్తరణ చేయడం, సంక్షేమ పథకాలను వినియోగదారులకు సమర్థవంతంగా చేరవేయడం, నిధుల వినియోగం తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకున్నామని రామస్వామి వివరించారు.

కేబుల్ ఆపరేటర్లపై రాజకీయం తగదు

» లక్షలాది మంది ఉపాధిని దెబ్బతీయొద్దు » కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తే ఊరుకోం
» ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కాకినాడ/కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రంగంలో జీవనోపాధి పొందుతున్న సెమీ స్కిల్డ్ కేబుల్ ఆపరేటర్ వ్యవస్థ పట్ల చిన్నచూపుతో వ్యవహరించడం వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఏమాత్రం తగదని ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి అన్నారు. కేబుల్ ఆపరేటర్లను విమర్శిస్తూ కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా అంబటి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 25వేల కేబుల్ ఆపరేటర్లతో పాటు వారి వద్ద ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. సమస్య మూలం ఎక్కడుందో తెలుసుకుని ప్రత్యక్షంగా అక్కడే తేల్చుకోవాలి తప్ప ఎలాంటి సంబంధం లేని కేబుల్ ఆపరేటర్లకు నష్టం వాటిల్లేలా రాంబాబు మాట్లాడడం మంచిది కాదన్నారు. ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ పురోగతికి తీసుకోవాల్సిన భవిష్యత్తు ప్రణాళికపై సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. కొన్నేళ్లుగా ఏపీ ఫైబర్‌నెట్ కోల్పోయిన కనెక్షన్ల వల్ల అటు సంస్థతో పాటు ఇటు ఏపీఎస్ఎఫ్ఎల్ కేబుల్ ఆపరేటర్లు కూడా తీవ్రంగా నష్టపోయారని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి కేబుల్ ఆపరేటర్లకు తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కేబుల్ సంఘం సీనియర్ నాయకులు అడపా వెంకటరావు, మల్లిపూడి శ్రీనివాస్, రాయుడు సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు గ్రహీత శ్యామలకు ఎమ్మెల్యే అభినందన

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ గోలి శ్యామల కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 2024లో విశాఖ నుంచి కాకినాడ వరకు సముద్రంలో 150 కిలోమీటర్లు ఈది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించానని, 30 కిలోమీటర్ల పొడవైన పాక్ జలసంధిని 13.47 గంటల్లో ఈది ప్రపంచంలో భారతదేశ రెండో మహిళగా, తొలి తెలుగు మహిళగా రికార్డు సృష్టించానని వివరించారు. శ్యామలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును ఎమ్మెల్యే అందజేసి భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు.


శ్యామలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


అన్నదాన విభాగం సూపరింటెండెంట్ సతీష్‌కు విరాళం అందజేస్తున్న బాల

అన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలోని నాగోల్‌కు చెందిన వేముల బాల ఈ మొత్తాన్ని అన్నదాన విభాగం సూపరింటెండెంట్ కోటమర్తి సతీష్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కంచిభట్ల రాంబాబు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో తెలంగాణ మంత్రి లక్ష్మణ్‌కుమార్

అన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి మంగళవారం తెలంగాణ రాష్ట్ర మంత్రి లక్ష్మణ్‌కుమార్ విచ్చేశారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


మంత్రికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి గడువు పొడిగింపు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశం కోసం రెండో విడత కౌన్సెలింగ్‌ను ఏఐటీటీ-2025 పరీక్షల కారణంగా పొడిగించినట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 20లోపు అడ్మిషన్ రిజిస్ట్రేషన్, 22వ తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐల్లోను, 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 0884-2348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు.

20న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

పిఠాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్ల ఎంపిక ఈ నెల 20న కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత పుట్టిన వారే అర్హులని చెప్పారు. ఇక్కడ ఎంపికైన వారు పిఠాపురంలో ఆగస్టు 14 నుంచి జరిగే 10వ ఆంధ్ర రాష్ట్ర బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్‌తో 20వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కాకినాడలోని జిల్లా క్రీడా మైదానం వద్దకు రావాలని సూచించారు.

నిర్లక్ష్యం ఖరీదు... నిండు ప్రాణం

» ప్రసవ సమయంలో గిరిజన మహిళ మృతి
» రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఘటన
» ఆలస్యంగా వెలుగులోకి..




కాకూరి పార్వతి (ఫైల్‌ఫొటో) పార్వతికి ప్రసవించిన బిడ్డ

రంపచోడవరం/వై. రామవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నిర్లక్ష్యానికి వై.రామవరం మండలానికి చెందిన కాకూరి పార్వతి అనే గర్భస్థ గిరిజన మహిళ తక్షణం మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 11న జరిగిన ఈ ఘటనను ఆసుపత్రి వైద్యులు అత్యంత గోప్యంగా ఉంచడం శోచనీయం. దీని పూర్వాపరాలిలా ఉన్నాయి. అల్లూరి జిల్లా వై.రామవరం మండలం జాజిగడ్డ గ్రామానికి చెందిన కాకూరి పార్వతి జూన్ 28న వై.రామవరం కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకువచ్చారు. 13రోజులపాటు ఆమెను ఇక్కడే ఉంచారు. ఈనెల 11న ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. బిడ్డ జన్మించిన వెంటనే ఆమె మరణించింది. బిడ్డను కూడా తదుపరి పర్యవేక్షణ కోసం కాకినాడ సాధారణ ఆస్పత్రికి తరలించారు. కాకూరి పార్వతికి ఇది రెండో ప్రసవం. తొలి ప్రసవం కూడా సాధారణంగా అప్పట్లో రాజమండ్రి ఆస్పత్రిలో జరిగింది. ఆమె విషయంలో రంపచోడవరం ఆసుపత్రిలో సరైన వైద్యపర్యవేక్షణ కరువైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని పరీక్షలు చేసిన తర్వాత మాత్రమే గైనకాలజిస్టు పర్యవేక్షణలో ప్రసవాన్ని నిర్వహిస్తారు. సాధారణ ప్రసవానికి అవకాశం లేని పరిస్థితుల్లో అన్ని వసతులూ ఉన్న ఆసుపత్రిలో సిజేరియన్ చేస్తారు. కానీ ఇక్కడ ఏం జరిగిందన్నది ఎవరూ చెప్పడం లేదు.

● ఐటీడీఏ పీవో చెప్పిన రోజే..

ఈనెల 11నే రంపచోడవరం ఐటీడీఏ పీవో రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులపట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి ఎటువంటి ప్రాణహానీ లేకుండా చూడాలని, అత్యవసర కేసులను హుటాహుటిన కాకినాడకో, రాజమండ్రికో తరలించాలని, ఇందులో ఏ నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించిన రోజునే గిరిజన మహిళ మరణం చోటుచేసుకుంది. అసలు ఈ ప్రసవం జరిగే సమయంలో వైద్యుల పర్యవేక్షణ ఉందా లేదా అన్నది కూడా తేలాల్సి ఉంది. తన భార్య మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కాకూరి పార్వతి భర్త దుర్గాప్రసాద్ ఆరోపిస్తున్నారు. 13 రోజులపాటు తన భార్య ఏరియా ఆస్పత్రిలోనే ఉన్నా ఆమె పరిస్థితి ఏంటో గ్రహించకుండానే ప్రసవం చేశారని, ఆ సమయంలో ఏదో కారణంతో తన భార్య చనిపోయిందని చెప్పి తనతో కాగితాలపై సంతకాలు తీసుకున్నారని ఆయన చెప్తున్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి నిర్లక్ష్యానికి తన ఇద్దరు బిడ్డలకు తల్లి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన భార్యకు అంత్యక్రియలు చేసుకోవాలో, తన పసిగుడ్డును కాపాడుకోవ డానికి కాకినాడకు వెళ్లాలో తేల్చుకోలేక దుర్గాప్రసాద్ నలిగిపోయాడు. తన ఆవేదనను దిగమింగుకుని భార్య అంతిమ సంస్కారాలు నిర్వహించి తన బిడ్డను కాకినాడ ఆస్పత్రిలో సంరక్షించుకుంటున్నాడు. ఈ ఘటనపై ఇంత వరకూ కనీస విచారణకు కూడా ఐటీడీఏ కానీ, వైద్య విధాన పరిషత్తు ఉన్నతాధికారులు కానీ ఆదేశించకపో వడం శోచనీయం. కాగా దీనిపై పాడేరులోని ఆరోగ్యసేవల జిల్లా కోఆర్డినేటర్ డా.నీలవేణి వివరణ ఇస్తూ గిరిజన మహిళ ప్రసవ సమయంలో మృతిచెందిన ఘటన తన దృష్టికి వచ్చిందని, దీనిపై తమ డైరెక్టరుకు సమాచారం ఇచ్చామని, అక్కడినుంచి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని స్పష్టం చేశారు.

'అనకాపల్లి' టు గొల్లప్రోలు

● గంజాయిని కొనుగోలు చేసి తెస్తూ విక్రయాలు
● పట్టుబడిన ఐదుగురు యువకులు... అందులో ఒక బాలుడు
● నాలుగు కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం
● నిందితుల్ని అరెస్టు చేసిన గొల్లప్రోలు పోలీసులు



నిందితులను చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ

గొల్లప్రోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ విలేకరులకు వివరాలను వెల్లడించారు. గొల్లప్రోలు పట్టణ శివారు ఈబీసీ కాలనీ దాటిన తర్వాత ఉన్న ఒక ప్రైవేట్ లే-ఔట్‌లో గంజాయి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ, ఎస్ఐ ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నలుగురు యువకులు గంజాయిని వాటాలుగా వేసుకుంటున్న దాన్ని గుర్తించారు. అలాగే వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో గంజాయి సరఫరా చేసే వ్యక్తి నుంచి తీసుకువచ్చి, అందులో కొంత వారి వినియోగానికి ఉంచుకుని, మిగిలిన దాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వెల్లడైంది. ఇందులో కాకినాడ రేచర్లపేటకు చెందిన కడియపు ప్రేమ్‌కుమార్, మరో బాలు డు, నక్కపల్లి మండలం రాజంపేటకి చెందిన మడ్డు లోకేష్, పిఠాపురం మంగాయమ్మరావుపేటకు చెందిన ధనాల మనోహర్, కొత్తపల్లి మం డలం మూలపేటకి చెందిన రామిశెట్టి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరు స్తామని సీఐ చెప్పారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

● చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, తదితరులు

సామర్లకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు కొత్త వంతెన సమీపంలో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న అంతర్ రాష్ట్ర నేరస్థుడు కంచర్ల మోహనరావు అలియాస్ మోహన్‌గా గుర్తించి సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. అలాగే అతని వద్ద నుంచి 50 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. క్రైం సీఐ అంకబాబు, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు నేతృత్వంలో నిఘా వేసి పట్టుకున్నామన్నారు. కేసుకు సంబంధించి ఎస్ఐ రమేష్‌బాబు, తదితర క్రైం సిబ్బందిని ఎస్‌డీపీవో అభినందించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


అవిడి సత్తిపండు (ఫైల్ ఫొటో)

రావులపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌తో జాతీయ రహదారిని దాటుతున్న ఇద్దరి వ్యక్తులను ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన అవిడి సత్తిపండు (51), అతడి స్నేహితుడు అత్తిలి ఏసుబాబు కలిసి ఓ పని మీద మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా గోపాలపురం చెక్‌పోస్టు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన ఇరువురిని కొత్తపేట ఆసుపత్రికి తరలించగా, సత్తిపండు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఏసుబాబుకు వైద్యం అందించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రావులపాలెం సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

గోకివాడ, పి.దొంతమూరు
ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

పిఠాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడ, పి.దొంతమూరు ఫీల్డ్‌అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి మంగళవారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. గోకివాడ ఫీల్డ్ అసిస్టెంట్ రాపా నవరత్నం ఒక వ్యక్తికి ఆరు రోజులు మస్తరు వేసి రూ.1,411 చెల్లించినట్టు అదే గ్రామానికి చెందిన గరగ నాగేశ్వరరావు డ్వామా, పాడా పీడీలకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏపీడీ వసంతమాధవి విచారణ చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు గుర్తించడంతో విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. అలాగే పి.దొంతమూరు ఫీల్డ్ అసిస్టెంట్ విఘ్నేశ్వరరావు పనుల్లోకి రాకుండానే పలువురి పేర్లపై మస్తర్లు వేసి సుమారు రూ.25వేలు దుర్వినియోగం చేసినట్టు విచారణలో వెల్లడైంది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. వీరిద్దరి సస్పెన్షన్‌ను ఏపీవో నాయుడు ధ్రువీకరించారు.

హ్యాట్సాప్ .. డ్రైవర్!

● ఎగ ఊపిరితో బాధపడుతున్న కండక్టర్ గణేష్
● గమనించి ఆర్టీసీ బస్సునే అంబులెన్స్‌గా చేసి ఆసుపత్రికి తరలింపు
● కండక్టర్ ప్రాణాలు కాపాడిన డ్రైవర్ కుమార్‌కు తోటి సిబ్బంది అభినందనలు




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ గణేష్, పక్కన ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైద్యో నారాయణో హరిః అంటారు.. ఎందుకంటే ప్రాణాలు నిలిపేవాడు వైద్యుడు.. ఆయన దేవుడితో సమానమని అర్థం. అయితే.. మంగళవారం జరిగిన సంఘటన చూస్తే డ్రైవరో నారాయణో హరిః అనాలేమో!. తక్షణం స్పందించిన ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ ఊపిరిని టాప్ గేర్‌లో నిలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం-సీతానగరం, పురుషోత్తపట్నం షటిల్ సర్వీసు బస్సు నడుస్తోంది. దానికి గణేష్ కండక్టరు కాగా.. డ్రైవర్‌గా కాటవరానికి చెందిన యూఎస్ కుమార్ ఉన్నారు. ఎండ మండిపోతున్నా.. మంగళవారం నాలుగు ట్రిప్పులు వేశారు. ఐదో ట్రిప్పు వెళ్లి బుధవారం ఉదయం మొదటి బస్సుగా పురుషోత్తపట్నం నుంచి రావాల్సి ఉంది. అయితే, నాలుగో ట్రిప్పుగా గోకవరం బస్టాండుకు వచ్చిన తర్వాత తిరిగి వెళ్లడానికి ఒక గంట సమయం ఉంది. ఈలోపు బస్సులోనే ఉన్న గణేశ్ ఎగఊపిరితో ఆందోళన పడుతున్నాడు. గుండెపై చేయివేసుకొని తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇది గమనించిన డ్రైవర్ కుమార్ అంబులెన్స్ కోసం ఎదురుచూడలేదు.. తన పైఅధికారి (ఆర్టీసీ సీఐ)కి ఫోన్ చేశారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమని ఆదేశించడంతో బస్సును టాప్ గేర్‌లో ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అంతే వేగంతో స్పందించిన డాక్టర్ భారతి ఆయన్ని పరీక్షించి ఈసీజీ, తదితర వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పడంతో తోటి సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. ఎండలు మండిపో తున్న వేళ కనీస విశ్రాంతి లేకుండా బస్సులు తిప్పడంతో సిబ్బంది ప్రాణాలపైకి వస్తోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. రెండేళ్ల క్రితం ఇలాగే ఒక డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో నేరుగా ప్రభుత్వాస్పత్రికి బస్సును నడిపించారు. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వ్యవహరించడంతో ఆయనకు. ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఆర్టీసీ సిబ్బంది నిబంధనల ప్రకారం వైద్యప రీక్షలు నిర్వహిం చకపోవడంతో ఇలాంటి తీవ్రమైన సమస్యలు వస్తున్నట్టుగా తెలుస్తోంది.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం


రాజమహేంద్రవరం వద్ద వరద ప్రవాహం



ధవళేశ్వరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ 175 గేట్లను 0.30 మీటర్ల మేర పైకి ఎత్తి 1,59,747 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 10.70 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం 3 డెల్టాలకు 14400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 18.40 అడుగులకు చేరుకుంది.

ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటులో మంటలు

అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

అల్లవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ ప్రహరీ సమీపంలో ఆక్వా చెరువుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం విద్యుత్ తీగలు కలిసిపోయి మంటలు వ్యాపించాయి. విద్యుత్ లైన్‌మెన్ సరఫరాను నిలిపివేయడంతో ఓఎన్జీసీ ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మూడు తాడి చెట్లు దగ్ధమయ్యాయి. ఓడలరేవు తీరం సీఆర్‌జడ్ పరిధిలో ఆక్వా చెరువుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నెలకొల్పగా తీగలు రెండు కిలోమీటర్ల పొడవునా నేలపైన పడడంతో యమపాశాలుగా మారాయి. అనధికార విద్యుత్ సరఫరా ఇవ్వడం వల్లే ప్రమాదానికి కారణంగా పలువురు భావిస్తున్నారు.

కుమార్తెల అదృశ్యంపై ఫిర్యాదు



కడియం, జూలై 15(ఆంధ్రజ్యోతి): తమ కుమార్తెలు కనిపించడం లేదని కడియం గ్రామానికి చెందిన పంద్రిళ్ల చెల్లా చంద్రారత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పెద్ద కుమార్తె వీరనాగవల్లి పదో తరగతి, చిన్న కుమార్తె పద్మప్రియ తొమ్మిదో తరగతి చదువుకున్నారని, ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారన్నారు. మంగళవారం ఉదయం గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి వస్తామని చెప్పి వెళ్లిన వారు తిరిగి రాలేదని, వెళ్లే సమయంలో సెల్‌ఫోన్లు వెంట తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి ఆచూకీ తెలిస్తే 94407 96587, 93477 05890 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

కాకినాడ మెయిన్ రోడ్డులో Jewelary & Textile షోరూంలో పనిచేయుటకు Computer Oprater కావలెను. డేటా ఎంట్రీ స్కిప్ట్ ఆపరేటింగ్‌లో అనుభవం కలవారికి ప్రాధాన్యత శాలరీ రూ.22,000/- మరియు షాపులో పనిచేయుటకు సిబ్బంది కావలెను Qly. Inter రూ.18వేలు, డిగ్రీ రూ.20వేలు మరియు కాకినాడలో ఒక ఇంట్లో వంట, ఇంటిలో పనులు చేయుటకు 35సం॥ల లోపు ఆడ వంట మనిషి కావలెను జీతం రూ.20వేలు కాకినాడ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. Cont 6301943220, 8008440189

AJD:244767

WANTED

» విజయవాడ, మొగలరాజపురం నందు 24 గం.లు ఇంటిలో వంట పని మరియు ఇంటి పని చేయుటకు ఆడ మనిషి కావలెను. ఆసక్తికరమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 83417 15255, 79974 43771

AJB-235377

వధువు కావలెను

37 సం॥గల డైవర్స్ బిజినెస్ వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు లేదా చేదోడుగా ఉండానికి కావలెను. పిల్లలు వున్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు, నో డౌరీ సెల్: 6301943220, 8008440189

AJD:244766

4 Lines CLASSIFIED Rs.230/- Only

ఆంధ్రా పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, జూలై15 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ ఆంధ్రా పోలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ద్వారా రెండో సంవత్సరంలో డిప్లొమో కోర్సుల్లో మిగిలిన సీట్ల కోసం ఈనెల 19న స్పాట్ అడ్మిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.జనార్ధనరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. దీనికి ఏపీసీ-2025, ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏదొక పాలిటెక్నిక్ కాలేజీలో 6 నుంచి ఇంటర్ వరకూ స్టడీ సర్టిఫికెట్లు, టెన్త్, ఇంటర్ మార్కుల మెమోలు టీసీ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో దరఖాస్తులను అందజేయాలని కోరారు. 19న కాకినాడ ఏపీటీలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

పొగాకు సాగు పరిమితికి మించొద్దు

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్


దేవరపల్లిలో పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటను పరిమితి మేరకే పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థలో పొగాకు పంట నియంత్రణ ఒప్పందంపై మన దేశం కూడా సంతకం చేసిందని, దానికి మేరకే పొగాకు పంటను పండించాలన్నారు. రైతులు పొగాకుతో పాటు ప్రత్యామ్నాయ పంటలు పండించుకో వాలన్నారు. జింబాబ్వే, బ్రెజిల్, టాంజానియా, యుగండ, ఆఫ్రికా దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిందని, దాని ప్రభావం మన పొగాకుపై పడుతుందన్నారు. ఈ ఏడాది 61మిలియన్ కిలోల పొగాకు పంటకు అనుమతిస్తే 80 మిలియన్ కిలోలు పండించారన్నారు. వచ్చే ఏడాది 49 మిలియన్ కిలోలకే అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ నెలలో వేయాల్సిన నాట్లు ఆలస్యంగా వేశారన్నారు. భాడవ, నల్ల నెలల్లో వర్జీనియ పొగాకు పండించడం వల్ల నాణ్యత కోల్పోతుం దని దాని ప్రభావం మన పొగాకుపై పండు తుందన్నారు. గత ఏడాది పొగాకు అదనపు పంటపై సెస్ లేకుండా రూ.124 కోట్లు రైతులకు లబ్ధి చేకూరిందని ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదన్నారు. అమ్మకాలు సెప్టెంబరు నెలాఖరుకు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్, దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాసరావు, కేవీవీ సత్యనారాయణ, రైతులు యాగంటి వెంకటేశ్వరరావు, బిక్కిన నాగరాజు, యగంటి సాయిబాబు పాల్గొన్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లనన్నాడని ఆత్మహత్యాయత్నం

● గడ్డి మందు తాగిన భార్య.. ఆసుపత్రికి తరలింపు.. అత్తింటిపై కేసు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్యామల

అమలాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి):ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి తిరిగి వచ్చిన భర్త.. భార్యపై అనుమానం పెంచుకోవడంతో పాటు కాపురానికి తీసుకెళ్లనని పెద్దల సమక్షంలో చెప్పడంతో అవమాన భారంతో భార్య గడ్డిమందు తాగి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఎస్ఐ వై.శేఖర్‌బాబు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం హైస్కూలు సెంటర్‌కు చెందిన దూనబోయిన రమేష్‌తో నల్లమిల్లి రాజీవ్ గృహకల్పకు చెందిన శ్యామలతో వివాహం జరిగింది. వివాహమైన కొద్దికాలానికే రమేష్ ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లాడు. 8 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి తనకు తెలిసిన సెంట్రింగ్ పని చేసుకుని జీవిస్తున్నాడు. గల్ఫ్‌లో ఉండగానే భార్య శ్యామలపై అనుమానం పెంచుకున్నాడు. దాంతో ఈ నెల 14న నేదునూరు పెదపాలెంలో పెద్దల సమక్షంలో తగువు నిర్వహించారు. భార్యపై అనుమానం పెంచుకోవడం, కాపురానికి తీసుకెళ్లనని రమేష్ తెగేసి చెప్పడంతో సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన శ్యామల ఇంట్లో ఉన్న గడ్డిమందును తాగేసింది. తల్లి గుర్తించే సరికే ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో శ్యామలను హుటాహుటిన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ మంగళవారం శ్యామల ఇచ్చిన సమాచారం ఆధారంగా భర్త రమేష్ కుటుంబ సభ్యులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.

తుని పోలవరం పనుల్లో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

తుని రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తుని పట్టణ శివారు కత్రాళ్లకొండ వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటవుతున్న భారీ అక్విడెక్ట్ వద్ద ప్రమాదం జరిగింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన పలువురు కార్మికులు సుమారు వంద అడుగుల లోయలో ఐరన్ ఊచలు అమరుస్తుండగా ప్రమాదవశాత్తూ కార్మికులపై పడ్డాయి. దీంతో శ్రీనివాస్, రెహమాన్ అనే ఇద్దరి కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన బయటకు తీసి తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కాంట్రాక్టర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

487 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్

బిక్కవోలు, జూలై 15(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం శివారు కానేడులో బలభద్రపురానికి చెందిన దుర్గాప్రసాద్, మొండి వీరవెంకట అభినవ అక్రమంగా నిల్వ వుంచిన ఇసుకను జిల్లా మైనింగ్ అండ్ జియాలజి ఆఫీసర్ డి.ఫణిభూషణ రెడ్డి మంగళవారం సీజ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచడంతో ఫణిభూషణరెడ్డి సిబ్బందితో వచ్చి ఆధారాలు చూపమనగా, చూపకపోవడంతో 487 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

కేసుల పరిశీలనపై సూచనలు

జిల్లా అడాల్ట్ ట్రయల్ రెఫర్మ్ కమిటీ మీటింగ్ నిర్వహించిన ఉమ్మడి జిల్లా జడ్జి సునీత


సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా అడాల్ట్ ట్రయల్ రిఫర్మ్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌ను ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చైర్మన్ గంధం సునీత నిర్వహించారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి కార్యాలయంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల్లో ఉన్న క్రిమినల్ కేసుల పరిశీలన, డ్రగ్స్, పెయిడ్ ఫైల్ కేసుల విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. టీనేజ్/జ్యూవనైల్ విషయాల్లో డ్రగ్స్ ఎఫెక్ట్, ఎదుర య్యే సమస్యలపై తాత్కాలిక చట్టాల గురించి చర్చించారు. సంబంధిత అధికారులకు తగిన స్పష్టతను ఇచ్చారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్ సందర్భంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శిపై బాధ్యతల పరిధులపైకూ లంకుషంగా చర్చలు జరిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే జోషి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా ఏపీపీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌పీవీ సుబ్బరాజు, ఎన్‌బీడబ్ల్యూ క్లస్టర్ అధికారులు, కాకినాడ జిల్లా డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, డాక్టర్ ఎన్ఆర్‌కే అన్వేషణ, కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ బీఆర్‌బీటీ ప్రసాద్, అల్లూరి జిల్లా డీఎస్పీ జె.సాయి ప్రకాష్, జిల్లా చైల్డ్, సబ్ కంట్రోల్ ఆఫీసర్, ఉమ్మడి జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోర్ట్‌ను తప్పుదారి పట్టించిన ఇద్దరికి ఆరు నెలల జైలు

2005 నాటి కేసులో తీర్పు వెల్లడి.. నిందితులు విశాఖపట్నం వాసులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో కోర్టును తప్పుదారి పట్టించిన ఇద్దరు వ్యక్తులకు ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రమ్య చావలి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2005లో విశాఖపట్నంలోని శాంతినగరానికి చెందిన సింగవరపు శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాస్‌ల ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బొల్లా ఈశ్వరరావుపై ఏసీబీ రాజమండ్రి వారు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సమయంలో ఫిర్యాదుదారులు ఇద్దరు తప్పుడు సాక్ష్యం చెప్పడాన్ని కోర్టు గుర్తించింది. ఈ మేరకు ఏసీబీ జడ్జి ఇచ్చిన ఆదేశాలతో ఈ కేసును 3వ అదనపు ఫస్ట్ క్లాస్ కోర్టులో నమోదు చేసి విచారణ జరుపగా నేరం రుజువు కావడంతో సింగవరపు శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాస్‌లకు ఆరు నెలల జైలు శిక్ష, ఐదువేల జరిమాన విధించారు. జరిమాన చెల్లించకపోతే మరో రెండు నెలలపాటు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి రమ్య చావాలి తీర్పును వెల్లడించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ను ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

సమష్టి కృషితో నిపుణ్ ఆంధ్ర సాధ్యం



ప్రధానోపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో

డీఈవో వాసుదేవరావు

రాజానగరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నిపుణ్ ఆంధ్రా లక్ష్య సాధనలో ఉపాధ్యాయులంతా సమష్టి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండలంలోని మల్లంపూడి శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ రెండో రోజు మంగళవారం నాటి శిక్షణా తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు నాయకత్వం వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాపరమైన అనేక కార్యక్రమాలను పర్యవేక్షించడానికి, అభ్యసనా సామర్థ్యాలు, పాఠశాల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంపొందించేందుకు, నిపుణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు ప్రధానోపాధ్యాయులంతా సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు మూడో తరగతి చివరి నాటికి చదవడం, రాయడం, సంఖ్యలతో పరిజ్ఞానం సాధించడంలో సహాయపడడం, అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడం, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంపై దృష్టి పెట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యనందించడం నిపుణ్ భారత్ మిషన్ ముఖ్య లక్ష్యాలుగా పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మంచి నాయకత్వ పటిమతో విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. శిక్షణా తరగతుల నిర్వహణ తీరును, వసతుల పట్ల డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంతో గౌరీశంకర్, కౌవల్య ప్రతినిధి శైలజ, అనపర్తి ఎంఈవో సత్తిరెడ్డి, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ శ్రీరామ్మూర్తికి పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మండేలా శ్రీరామ్మూర్తి కుమార్తె తేజశ్విని (28) సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మంగళవారం ఉదయం మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేగోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పలువురు పోలీస్ అధికారులు, సీనియర్ జర్నలిస్టులు, ఎడిషన్ ఇన్‌చార్జిలు, సబ్‌ఎడిటర్లు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వీడియో జర్నలిస్టులు బొమ్మూరు మురళీకొండలోని శ్రీరామ్మూర్తి నివాసానికి వెళ్లి తేజశ్విని పార్థివ దేహానికి నివాళులర్పించారు. శ్రీరామ్మూర్తిని పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కాగా తేజశ్విని అంత్యక్రియలు రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట కైలాస భూమిలో జరిగాయి.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై తనిఖీ



బిక్కవోలులో కాలువ పనులు తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

బిక్కవోలు, జూలై 15(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను మంగళవారం నేషనల్ లెవిల్ మోనిటరింగ్ బృంద సభ్యులు నాగరాజు, వినోద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీరు ప్రతి పథకం అమలు తీరును, ప్రయోజనదారుల అభిప్రాయాలు సేకరించారు. ముఖ్యంగా స్వచ్ఛభారత్, ఆయుష్మాన్‌భారత్, జలజీవన్ మిషన్, పీఎం కిషాన్ యోజన, పీఎం ఆవాస్ యోజన, ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు, జాబ్ కార్డుదారుల అభిప్రాయాలు, హౌసింగ్‌లో నిర్మించిన ఇళ్లు, యజమానుల అభిప్రాయాలు, డ్వాక్రా సభ్యులు, పింఛనుదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. బృందం వెంట హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్, డీఈఈ వనమయ్య, పీఆర్ డీఈఈ అచ్యుతరామారెడ్డి, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏపీవో అగస్టీన్‌కుమార్, ఏపీవో సుప్రియ తదితరులు ఉన్నారు.

నైపుణ్యంతోనే సాంకేతిక విద్యలో అభివృద్ధి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలంటే సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలని జీజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ మేడూరి శ్రీధర్ శర్మ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయబిలిటీ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ యువనైపుణ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి నైపుణ్యాల వైపు మరీ ముఖ్యంగా ఏఐ పట్ల పూర్తి అవగాహన, నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరుపణ్యం, వై.స్వర్ణశ్రీ, సీఎస్‌డీఈపీ డైరెక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

వేమగిరిలో అసంక్రమిక వ్యాధుల సర్వే



వేమగిరిలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

కడియం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి-3 సచివాలయం పరిధిలో అసంక్రమిక వ్యాధుల సర్వే 3.0 మంగళవారం నిర్వహించారు. క్వాలిటీ అసెస్మెంట్‌లో భాగంగా ప్రభుత్వ వైద్యకళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగ సిబ్బంది వేమగిరి గ్రామాన్ని సందర్శించి రాండమ్‌గా గృహాలను ఎన్నుకుని సర్వే నిర్వహించారు. గతంలో పీహెచ్‌సీ పరిధిలో ఎన్‌డీ డీ 3.0 సర్వేలోని నాణ్యతను అంచనా వేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా కొన్ని అసంక్రమిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి కౌన్సిలింగ్ చేశారు. ఈ సర్వే జిల్లాలోని ఐదు గ్రామాల్లో జరుగుతుందని, అందులో వేమగిరి ఒకటని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీనివాసనాయక్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్య కళాశాల అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్‌లు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మణిజ్యోత్స్న, హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్ రోడ్డులోని ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రముఖ స్వాతంత్ర సమర యోధురాలు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జయంతిని నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయ కిరణ్ మాట్లాడుతూ దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళల కోసం ప్రత్యేకంగా ఆంధ్ర మహిళా సంస్థను స్థాపించి, మహిళలకు, విద్య, వైద్యం, ఉద్యోగావకాశాలను కల్పించారన్నారు. నేషనల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు, రాజ్యాంగ సభ సభ్యురాలిగా ఆమె చేసిన సూచనలు, భారత రాజ్యాంగాన్ని రూపుదిద్దడంలో మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. హిందీ భాషాభివృద్ధి కోసం చేసిన కృషిని రాజమహేంద్రవరానికి ఆమెకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్.మార్కండేయులు, వి.సర్వేశ్వరరావు, ఎస్.త్రివేణి, టి.శ్యామల, టీవీవీ పద్మావతి, పి.రాంబాబు, ఎల్.మదన్ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వాతంత్ర సమరయోధుల పార్కులో ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వాధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమితి సభ్యులు దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంవీ పద్మావతి, కోసూరి చండీప్రియ, మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా, గుడిపూడి సునీల్ గౌతమ్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి రూ.13 లక్షలు విరాళం



చీరలు అందుకున్న మహిళలతో శ్రీనివాసరావు

శ్రీరంగపట్నంలో మహిళలకు పట్టుచీరల పంపిణీ

కోరుకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపట్నంలో మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి, శాశ్వత షెడ్ నిర్మాణానికి రూ.13 లక్షల విరాళాన్ని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ప్రకటించారు. మంగళవారం ఆయన శ్రీరంగపట్నంలో మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగపట్నం గ్రామం నా సొంత కుటుంబం లాంటిదని ఈ గ్రామానికి ఏ అవసరం వచ్చినా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 500 మంది మహిళలకు ఉచితంగా పట్టుచీరలు పంపిణీ చేశారు. షెడ్ నిర్మాణానికి ప్రకటించి విరాళంలో మొదటి విడతగా రూ.1లక్ష చెక్కు కమిటీకి అందజేశారు. మిగిలిన రూ.12లక్షలు త్వరలో అందజేస్తామన్నారు. ఇంతకు ముందు ఇదే గ్రామంలో పలు ఆలయాల అభివృద్ధికి లక్షలాది రూపాయల విరాళం ఇచ్చినట్టు కంబాల పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బాపన్నదొర, వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, నాగ రమేష్, వీరాంజలి, జాజుల నరసింహమూర్తి, కోటేశ్వరరావు, దేవి, కన్నారావు, పురుషోత్తం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మళ్లీ దాహం కేకలు

పది రోజులుగా నిలిచిపోయిన సత్యసాయి మంచినీటి సరఫరా



కోరుకొండలో 10 రోజులుగా మంచినీరు రాక ఖాళీగా ఉన్న ట్యాంకు

» 19 నెలలుగా రాని జీతాలు
» సమ్మెలో సత్యసాయి కార్మికులు
» 90 గ్రామాలకు తాగునీటి కష్టాలు

కోరుకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు సమ్మె బాట పట్టడంతో 10రోజులుగా సీతానగరం, కోరుకొండ, గోకవరం, దేవీపట్నం, రాజానగరం మండలాల్లోని సుమారు 90 గ్రామాల ప్రజానీకానికి రక్షిత మంచిటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఎండలు మండుతున్న వేళ మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సత్యసాయి మంచినీటి సరఫరా ప్రాజెక్టులో పని చేసే కార్మికులకు 19 నెలలుగా ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదు. వారందరూ కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాడు. పలు మార్లు అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోవడంతో సమ్మె బాట పట్టారు. మూడు నెలల క్రితం జీతాలు కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. కలెక్టర్ వెళ్లి నచ్చజెప్పి దీక్షలు విరమింపజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా రెండు నెలల జీతాలు మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారు. అప్పటికే వారికి 17నెలల జీతం బకాయి ఉంది. ప్రస్తుతం 19 నెలలకు చేరుకుంది. విసుగు చెందిన కార్మికులు సమ్మెకు దిగారు. ఈ నెల 8నుంచి సమ్మె కొనసాగుతోంది. దీనిలో భాగంగా వారు గోకవరం నుంచి రాజమహేంద్రవరం వరకు 35కిలోమీటర్ల మేర 53 మంది కార్మికులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి నిరసన తెలిపారు. మెయిన్ హెడ్‌వర్క్స్, సబ్ హెడ్‌వర్క్స్‌లలో శుద్ధి చేసిన గోదావరి నీటిని విడుదల చేయడానికి నిరంతరం 53 మంది కార్మికులు 90 గ్రామాల్లో సేవలందిస్తారు. సత్యసాయి మంచినీరు సరఫరా కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికుల జీతాలు చెల్లింపు విషయంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని సమ్మెను విరమింపజేయాలని, తమకు తాగునీటిని సరఫరా చేసి దాహార్తిని తీర్చాలని 90 గ్రామా ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక..

మాకు న్యాయంగా రావాల్సిన 19 నెలల జీతం రాకపోవడంతో అప్పులు బాధ తట్టుకోలేక ఒక కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మేము ఎంతకాలం అప్పులు చేసుకుంటూ జీవనం కొనసాగించగలం. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామం. గత్యంతరం లేక సమ్మెకు దిగాం.

-ఇస్సాకు, యూనియన్ సెక్రటరీ.

19 నెలలుగా జీతాల్లేవు

సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులు 19 నెలల నుంచి జీతాలు అందడం లేదు. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేక సార్లు తెలియజేసినప్పటికీ మాకు న్యాయం జరగలేదు. దొరికిన చోట అప్పులు చేసి ఇంతకాలం కుటుంబాలను నెట్టికొచ్చాం. ఇక మా వల్ల కాదు. జీతాలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తాం.

-పాలాడి శ్రీనివాస్, కార్మిక యూనియన్ ఉపాధ్యక్షుడు.

పేదల సంక్షేమమే ధ్యేయం

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
» పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు



హుకుంపేటలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ జూలై 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని హుకుంపేటలో రాష్ట్ర హెల్త్ విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్, స్థానిక నాయకులతో కలిసి ఆయన మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు వింటూ సత్వర పరిష్కారాలు చేస్తూ వివరాలను టెలిగ్రామ్ బాట్‌లో అప్లోడ్ చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ చంద్రన్న పాలనలో రాష్ట్రం మెరుగైన పాలనవైపు అడుగులు వేస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికలతో వెళుతున్నామని, వాటిలో భాగంగానే గ్రామాల్లో ప్రజల అభీష్టం మేరకు రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, మత్స్యేటి ప్రసాద్, దుద్దుపూడి రామకృష్ణ, మజ్జి పద్మావతి, దుద్దుపూడి రమేష్, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం, పెండ్యాల రామకృష్ణ, బొప్పన శ్రీను పాల్గొన్నారు.

ప్రజల్లో సంతృప్తి: వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని 37, 41, 42 డివిజన్లలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. ప్రజల అభిప్రాయాలను టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుంటే చూసి తట్టుకోలేక వైసీపీ అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇదిలా ఉండగా నగరంలో ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి రూ.7 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వాసు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మలపల్లిలో మనోజ్‌రెడ్డి..

బిక్కవోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లపల్లి శివారు తుమ్మలపల్లిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్లపల్లిలో ఏడాది కాలంలో రూ.5.18 కోట్లతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని గ్రామస్థులు తెలపడంతో వెంటనే సరి చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, తనుకు శ్రీధర్, పడాల చినబుజ్జి, రెడ్డి శ్రీను, కన్నీరు రాఘవ, తనుకు వెంకన్న, కటిమేని బాలు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని సుభద్రంపేటలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు పర్యటించారు. ఈ ఏడాది కాలంలో మొత్తం రూ.3.82 కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, నాయకులు పూసల శ్రీను, అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు, యడ్ల గణేష్, వట్టికూటి వెంకన్నబాబు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

సమాజం, పరిశ్రమల్లో విప్లవాత్మక మార్పులు



బాలభాస్కర్‌ను సన్మానిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

దౌత్యవేత్త బాలభాస్కర్

దివాన్‌చెరువు, జూలై15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఎన్నో సమస్యలతో సతమతమవుతోందని ప్రముఖ దౌత్యవేత్త బి.బాలభాస్కర్ అన్నారు. భారతీయ దృక్పథంలో విఘాతం కలిగించే సాంకేతిక పరిజ్ఞానాల భౌగోళిక శాస్త్రాన్ని నావిగేట్ చేయడం అనే అంశంపై మంగళవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సెమినార్ నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన బాలభాస్కర్ మాట్లాడుతూ టెక్నాలజీలో జరిగే తీవ్రమైన మార్పులతో సమాజం, పరిశ్రమలో ఆర్థిక, ట్రేడ్ మోడల్స్ టారిఫ్ స్ట్రక్చర్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. అధ్యాపకులు తమ సబ్జెక్టుల్లో అప్‌డేట్ కావాలన్నారు. భూమినుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో క్వాంటం టెక్నాలజీ ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ సందర్భంగా బాలభాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నన్నయ వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, కార్యక్రమ కోఆర్డినేటర్ వి.పెర్సిస్, అధ్యాపకులు పి.సురేష్‌వర్మ, బి.జగన్మోహనరెడ్డి, కె.రమణేశ్వరి పాల్గొన్నారు.

వీసీకి అభినందన..

నెల్సన్ మండేలా ఇనస్పైర్ అవార్డు-2025 ను ఇటీవల అందుకున్న సందర్భంగా వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని మంగళవారం నన్నయ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారపు విజయబాబు, ఉపాధ్యక్షుడు సోము వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వై.వీరభద్రచౌదరి తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఎస్సీ, బీసీ హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు



నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్

అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ హాస్టల్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ఏర్పాటు, మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 22 ఎస్సీ హాస్టళ్లకు సంబంధించి పలు హాస్టళ్లలో మరమ్మత్తు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. మొత్తం రూ.3 కోట్ల 78 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో మైనర్ రిపేర్లకు రూ.2.10 కోట్లు, మేజర్ రిపేర్లకు రూ.1.67 కోట్లు కేటాయించామని చెప్పారు. అలాగే జిల్లా 23 బీసీ హాస్టళ్లకు సంబంధించి ఐదు హాస్టళ్లలో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడించారు. వై.జంక్షన్‌లోని బాలుర హాస్టల్‌లో రూ.30 లక్షలతో శాశ్వత డైనింగ్ హాల్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి మహ్మద్ ఘయాజుద్దీన్, బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పనిచేయాలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పొందిన వారు క్రమశిక్షణతో పనిచేయాలని రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కారుణ్య ఉద్యోగాలు పొందిన ముగ్గురికి నియామక పత్రాలను ఆమె అందించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్లు, ఒకరికి పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా నియామకాలు చేపట్టామన్నారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరిన వారు సీనియర్ల వద్ద మెళకువలు నేర్చుకుని సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ఆయా శాఖల అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్‌లు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

మాస్టర్స్ కప్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఏఎస్పీ మురళీకృష్ణ



టోర్నీ ప్రారంభోత్సవంలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ చెంచురెడ్డి అన్నారు. భారత రైసింగ్ ఫౌండేషన్ జైకిషన్ (జేకే) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న మాస్టర్స్ కప్ క్రికెట్ టోర్నీ (40ఏళ్ల విభాగం)ని వారు ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి మ్యాచ్ జట్టు రాజమహేంద్రి క్రికెట్ క్లబ్ వర్సెస్ ఆనంద్ వారియర్స్ మ్యాచ్‌ను వారు, రాజమండ్రి సిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారులంతా స్నేహభావంతో ఉండాలన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలను క్రీడగా కాకుండా జీవితంలో ఒక భాగస్వామిగా చేసుకోవాలన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్య వయస్సు వారిని ఉత్సాహం కలిగించడానికి 40 ఏళ్ల కేటగిరిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జైకిషన్ మాట్లాడుతూ సీజన్-1 8 రోజులపాటు జరుగుతుందన్నారు. ఈ టోర్నీలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

రంగంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా చేసే ప్రయాణం ప్రమాదకరమని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ అన్నారు. మంగళవారం రంగంపేట ఏడీబీ రోడ్డుపై పోలీస్‌స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, రోడ్డు ప్రమాదాలపైన అవగాహన కల్పించారు. అనేక ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రాణాలను పోతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేసి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

కోరుకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ తహశీల్దార్ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం ఆర్డీవో బాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుస్వాగతం, ఇతర రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో జరుగుతున్న రెవెన్యూ కార్యక్రమాలు, భూ సర్వేకు సంబంధించిన అంశాలపై ఆర్డీవో చర్చించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

అనపర్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనపర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమితులైన సత్తి బులిరెడ్డికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో దాచుకో దోచుకో అంటూ పాలన సాగించారని అందుకే ఉన్నతాధికారులు కూడా జైలు ఊచలు లెక్కపెడుతున్నారని అన్నారు. నూతన లంచగొండి విధానాన్ని కనుగొన్న జగన్‌రెడ్డి అవినీతిలో రికార్డు సాధించారని అన్నారు.

డెంగ్యూతో జాగ్రత్త!

అనపర్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రామవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అనపర్తిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీహెచ్ఎస్ సీవీ లక్ష్మి అన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అనపర్తిలో డెంగ్యూపై అవగాహన సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఓ భామ అయ్యో రామ
సూర్యమినీ	: ఎఫ్1 ది మూవీ, 3బీహెచ్‌కే
సూర్యప్యాలస్	: జురాసిక్ వరల్డ్, డి-100
స్వామి	: కుబేర
శివజ్యోతి	: తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: సూపర్‌మేన్
రాజా	: సూపర్‌మేన్
ఊర్వశి	: మిరపకాయ్, కుమారి 21ఎఫ్
రంభ	: మార్గన్
మేనక	: జురాసిక్ వరల్డ్
అప్సర	: సూపర్‌మేన్
కుమారి	: ----
అశోక	: సూపర్‌మేన్
పీఎస్ మహల్(నామవరం)	: సూపర్‌మేన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సూపర్‌మేన్
వెంకటసూర్య(కడియం)	: సూపర్‌మేన్
సత్యగౌరి (అనపర్తి)	: ఓ భామ అయ్యో రామ
సూర్యశ్రీ (అనపర్తి)	: కుమారి 21ఎఫ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: సూపర్‌మేన్
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తమ్ముడు
శ్రీనివాస (గోకవరం)	: సూపర్‌మేన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కుమారి 21ఎఫ్
లలితామహల్(రంపచోడవరం)	: తమ్ముడు
నవయుగ(చింతూరు)	: తమ్ముడు


రైల్వే జీఎం శ్రీవాస్తవతో చర్చిస్తున్న ఎంపీ పురందేశ్వరి

చల్లంగ చూడమ్మా..మోదకొండమ్మ


బోనాలతో మహిళల ఊరేగింపు

కోరుకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో మాత్రమే ఎక్కువగా కనిపించే ఆషాఢ మాస బోనాల ఉత్సవం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని సుమారు 100 మంది ఆడపడుచులు మంగళవారం బోనాలు తలపై ఎత్తుకుని మేళతాళాలు,మంగవాయిద్యాలతో గ్రామం అంతా ఊరేగారు. మోదకొండ ఆలయం వద్ద బోనాలు దించారు. చల్లంగ చూడమ్మా తల్లి అంటూ వేడుకున్నారు. మోదకొండమ్మ కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని.ప్రజలంతా సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుతూ ప్రతి సంవత్సరం ఈ బోనాలు ఉత్సవం నిర్వహిస్తామని గ్రామ సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి మోదుకొండమ్మ బోనాలు ఎత్తుకుంటున్నారు. ఈ ఏడాది కూడా ఆమె బోనాలు ఎత్తుకుని గ్రామమంతా కలియతిరిగారు. ఎక్కడెక్కడో ఉన్న ఆడబడుచులు గ్రామానికి చేరుకోవడంతో ఊరంతా సందడిగా మారింది.



పైసా మే పట్టా



ఫీజులుం!

రూ.1140 కోట్లుపైనే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు రూ.వెయ్యి కోట్ల వరకు పేరుకుపోయాయి.గత వైసీపీ హయాంలో రూ.600 కోట్ల వరకూ ఉన్నాయి.. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.540 కోట్లు బకాయి ఉంది. దీంతో సర్టిఫికెట్లు ఆపి విద్యార్థుల నుంచి బాకీలు కట్టించుకోవాల్సి వస్తుందని యాజమాన్యాలు అధికారులకు సంజాయిషీ ఇస్తున్నాయి.ప్రధానంగా కాకినాడ జిల్లా మెట్టప్రాంతంలో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీకి ఫీజు రీయిం బర్స్‌మెంట్ బాకీలు సెకండ్ ఇయర్ నుంచి ఫైనలియర్ విద్యార్థులవి కలిపి రూ.90 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. దానికి సమీపంలో ఉన్న మరో కాలేజీకి రూ.15కోట్ల వరకు పేరుకుపోయాయి.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు భారీ ఇంజనీరింగ్ కాలేజీల బకాయిలే రూ.240 కోట్ల వరకు ఉన్నాయి. ఇవికాక మధ్యస్తంలో ఉండే పది కాలేజీల బకాయిలు రూ.150 కోట్లు, మిగిలిన మరో పది కాలేజీల బకాయిలు రూ.60 కోట్ల వరకు ఉన్నాయని ఆయా యాజమాన్యాలు వివరిస్తున్నాయి.

ఫీజు బకాయి కట్టండి.. సర్టిఫికెట్లు పట్టుకెళ్లండి..

- కాలేజీ యాజమాన్యాల పట్టు
- ఇంజనీరింగ్ విద్యార్థుల ఇక్కట్లు
- రూ.1140 కోట్ల ఫీజు బాకీలు
- ఉద్యోగాలకు ప్రయత్నాలు
- సర్టిఫికెట్లు ఇవ్వడానికి ససేమిరా
- బాకీలు చెల్లించాలని డిమాండ్
- జమకాని ఫీజు రీయింబర్స్‌మెంట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను నిండా ముంచేసింది. నాడు ఫీజులు చెల్లించకుండా ముప్పతిప్పలు పెట్టింది. ఆ పాపం ప్రస్తుత ప్రభుత్వానికి చుట్టుకుంది. దీంతో సుమారు ఒక్క ఇంజనీరింగ్ కాలేజీలకే సుమారు వెయ్యి కోట్ల వరకూ ఫీజు బకాయిలు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది మంది ఇంజనీరింగ్ విద్యా ర్థులకు కాలేజీలు చుక్కలు చూపిస్తున్నాయి. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయి. ఫీజు బకాయి చెల్లించేవరకు వాటిని ఇవ్వబోమంటూ సతాయిస్తున్నాయి. సకాలంలో తమ సర్టిఫికెట్లను కంపెనీలు, ఇతర విద్యాసంస్థలకు ఇవ్వకపోతే అవకాశాలు పోతాయని మొత్తుకుంటున్నారు. అటు కాలేజీ యాజమాన్యాలేమో తమకు ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోవడంతో విద్యార్థులే చెల్లించాలని తెగేసి చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.540 కోట్ల వరకు ఉన్నాయి. ఇది కాకుండా గత వైసీపీ హయాంలో 600 కోట్లు వరకూ బాకీలు ఉండడం గమనార్హం.

బకాయిలు..ముప్పతిప్పలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జేఎన్టీయూ పరిధిలో మొత్తం 28 వరకు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఇందులో పది కాలేజీలు ఒక్క కాకినాడ జిల్లాలోనే ఉన్నాయి. మిగిలిన 18 కాలేజీలు కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్నాయి. మొత్తం 28 కాలేజీల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు 12 వేల మంది ఉన్నారు. విద్యార్థుల్లో అనేక మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు లభించాయి. కొందరేమో ఉన్నత చదువులకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్లు ఉండాలి. తీరా ఇప్పుడు ఇంజనీరింగ్ చదివిన కాలేజీలు వీటిని ఇవ్వ కుండా ఇబ్బంది పెడుతుండడంతో లబోదిబో మంటున్నారు. కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వొద్దని తెగేసి చెప్పేయడంతో ఎంత బతిమాలినా సిబ్బంది వీటిని ఇవ్వడం లేదు. దీంతో కొందరు అత్యవసరం అనుకున్న విద్యార్థులు అప్పులుచేసి ఫీజులు కడుతున్నారు. లేదంటే ఉద్యోగం పోతుందనే భయంతో బాకీలు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొన్ని కాలేజీలు తమ బకాయిలకు రాజధానిలో ఉన్న తాధికారులతో మాట్లాడుతున్నా స్పందన ఉండడం లేదు. పోనీ బాకీలు వేగంగా వస్తే సర్టిఫికెట్లు ఇవ్వాలని భావిస్తున్నా అది జరగడం లేదు. మరోపక్క బాకీలు రాకుండా సర్టిఫికెట్లు ఇచ్చేస్తే నష్టపోతామని భావిస్తున్నాయి. ప్రభుత్వం మారాక ఒక వాయిదా బాకీలు కాలేజీలకు అందాయి. ఇంకా మిగిలినవి రావాల్సి ఉందని చెబుతున్నాయి.అయితే ఫైనలియర్ విద్యార్థులు నాలుగు నుంచి ఐదు వాయిదాల వరకు బాకీలు చెల్లించాల్సి ఉందని చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం నానాపాట్లు పడుతున్నారు. కొందరైతే ప్రభుత్వం నుంచి రావాల్సిన రీయంబర్స్‌మెంట్ డబ్బులు మినహా మిగిలినవన్నీ చెల్లిస్తామని కాలేజీలను ప్రాథేయపడుతున్నారు. కానీ యాజమాన్యాలు మాత్రం ససేమిరా అంటున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక విద్యార్థులు తలలు పట్టుకున్నారు. ఇంతకాలం ఎంతో కష్టపడి చదివి చివరిలో ఇదేంటిరా అంటూ తలలు బాదుకుంటున్నారు. కొన్ని కాలేజీలైతే మరీ దారుణంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు ఎంపికైన విద్యార్థులను సైతం బకాయిల పేరుతో వేధిస్తుండడంతో వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. ప్రభుత్వం మారాక నేరుగా కాలేజీల ఖాతాల్లోనే జమవుతున్నాయి.

నిధులు తెచ్చినా.. టెండర్లు ఎందుకు పిలవలేదు..

రైల్వే జీఎం శ్రీవాస్తవను ప్రశ్నించిన ఎంపీ పురందేశ్వరి

- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక
- సమయం లేదని కలిసిన ఎంపీ
- పుష్కరాలకు పనులవ్వాలని సూచన
- కొవ్వూరులో రైలు హాల్ట్‌లపై విన్నపం
- పలు అభివృద్ధి పనులపై చర్చ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.271 కోట్ల నిధులు మంజూరు చేసి ఆరు నెలలు అవుతున్నా ఇంకా టెండర్లు ఎందుకు పిలవలేదని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సికింద్రాబాద్‌లోని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కలిసి ఆరా తీశారు. ఆంధ్రజ్యోతిలో మంగళ వారం పుష్కరాల నేపథ్యంలో రైల్వే పనుల్లో కదలిక లేదంటూ ప్రచురితమైన 'సమయం లేదు మిత్రమా' అనే కథనంపై ఆమె స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ పురందేశ్వరి సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవను కలిశారు. 2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమండ్రి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణీకులకు అందుబాటులోకి తేవాలని కోరారు. పార్లమెంట్ పరిధిలోని పలు రైలు అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. రాజమండ్రి ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు వెంటనే టెండర్లు పిలవాలని, పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. గోదావరి, కొవ్వూరు రైల్వేస్టేషన్లలో టాయిలెట్స్ వంటి సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. నిడదవోలు జంక్షన్‌లో రూ.150 కోట్లతో చేపట్టిన ఎలక్ట్రిఫికేషన్ పనులు, 4, 5 ప్లాట్‌ఫాం పనులు పూర్తయినా మెయిన్‌లైన్‌లో కలపడానికి అవసరమైన రూ.6 కోట్లను విడుదల చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. కొవ్వూరు-భద్రాచలం రైల్వే ప్రాజెక్టు 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడం, సర్వే జరిగినప్పటికీ పనులు పూర్తవలేదనే విషయాలను ఎంపీ ప్రస్తావించారు. వీటిపై రైల్వే జీఎం శ్రీవాస్తవ స్పందిస్తూ రాజమండ్రి ప్రధానరైల్వే స్టేషన్ అభివృద్ధికి సంబంధించిన పనులకు రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలిచి మొదటి దశ పనులను వెంటనే ప్రారంభిస్తామని వెల్లడించారు. కొవ్వూరు-భద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటా నిధులివ్వాల్సి ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం వల్ల సత్తుపల్లి వరకూ పనులు చేశామని, ఏపీ ప్రభుత్వం కూడా ఇస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తామని జీఎం వివరణ ఇచ్చారు. ఎంపీ పురందేశ్వరి వెంట రైల్వే యూనియన్ నాయకుడు ఉన్ని కృష్ణన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కొవ్వూరు బీజేపీ కౌన్సిలర్ పీఎం కృష్ణ ఉన్నారు.



కొవ్వూరులో రైళ్లకు హాల్ట్ ఇవ్వండి

కొవ్వూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కరోనాకు ముందు వరకూ కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 18 రైళ్లు ఆగేవని, ఇప్పుడు 8 రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని, ముఖ్యంగా చెన్నయ్, తిరుపతి వెళ్లే రైళ్లతోపాటు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూడా ఆగడం లేదని ఎంపీ పురందేశ్వరి ప్రస్తావించారు. రైళ్లకు తిరిగి హాల్ట్‌లను పునరుద్ధరించాలని జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు బీజేపీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019లో 34 రైళ్లకు హాల్ట్ ఉండేదని, కొవిడ్ సమయంలో రైళ్ల హాల్ట్‌లను పూర్తిగా నిలిపివేయడంతో కొవ్వూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాలకు సంబంధించి 100కు పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 2019 నాటి రైళ్లకు హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. అనపర్తి, నిడదవోలు స్టేషన్లలో జన్మభూమికి హాల్ట్ కల్పించాలని కోరారు.


రాజానగరం రావులచెరువు గట్టున కొలువు తీరిన శ్రీగోగులమ్మ మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. - రాజానగరం


నిడదవోలులో ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రైతులకు నష్టం లేకుండా పనులు చేయండి

ఆర్‌వోబీ పరిశీలనలో కలెక్టర్

నిడదవోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా ఆర్వోబీ నిర్మాణ పనులు చేయా లని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. నిడదవోలు పట్టణంలో గోదావరి కెనాల్ రోడ్డులో జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనులను మంగళవారం ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారు లతో కలిసి ఆమె పరిశీలించారు. ఎక్స్‌పర్ట్ కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి రైతాంగానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతిపాదించిన అంశాలపై నివేదిక అందజేయాలని సూచించారు. ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేసే క్రమంలో రైతులు వెల్లడిస్తున్న అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కరమార్గం చూపాలన్నారు. దారవరం గ్రామానికి చెందిన రైతులు పంట పొలాలు ముంపునకు గురవుతాయని ముంపునకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారని అన్నారు. రైతాంగానికి మేలు చేసే క్రమంలో భూ సమతుల్యత, ఎత్తుపల్లాలను గుర్తించి తగిన నివేదిక అందజేయాలన్నారు. ఎర్రకాలువ వరద వచ్చినప్పుడు ముంపు ప్రమాదం నేపథ్యంలో పరిష్కారానికి అధికారులు ఇచ్చే సూచనలు అనుసరించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణుల బృందం ఆర్డీవో, రైల్వే ఇంజనీర్స్, ఇరిగేషన్ ఎస్ఈ, జిల్లా వ్యవసాయ శాఖాధికారులతో కలసి మరొకసారి వాస్తవ పరిస్థితులను అంచనా వేయవలసి ఉంటుందన్నారు. ఆమె వెంట ఆర్డీవో రాణీ సుస్మిత,జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ రూప్ కుమార్, డీఈ వెంకటరమణ ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద శాంతియుత ధర్నా చేస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

పెన్షనర్ల నిరసన

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తూర్పు గోదావరి జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు బొమ్మూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కార సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం శాంతియుతంగా ధర్నాలు చేశామన్నారు. ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నగర యూనిట్ అధ్యక్షుడు కెకె.సంజీవరావు,సహాధ్యక్షుడు కొండపల్లి సుబ్రహ్మణ్యం, కెఎస్‌ఈఎస్.రాజు,ఎండీ అక్బర్, అడ్డా వీరవెంకటరాజు,ప్రసాద్, ఎం.జానకి రామయ్య,200 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

దొంగా.. పోలీస్!



గోదాట్లో ఏం జరుగుతుందనేది జనమెరిగిన సత్యమే.. అయినా మన అధికారులు మాత్రం దొంగా పోలీస్ ఆటాడేస్తారు.. సమన్వయంతో పనిచేస్తే గోదాట్లో ఇసుకను ఆపలేరా..? కానీ అలా చేయడంలేదు.. మామూళ్ల మత్తులో మునిగి తేలుతూ ఇష్టానుసారం అక్రమార్కులకు అండగా నిలబడుతున్నారు.. అధికార పక్షం నాయకులు వంతపాడుతున్నారు.. వైసీపీ నాయకులతో కుమ్మక్కవుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. అయినా పట్టుకునేవారెవరు!

ఇసుకాసురులను పట్టుకోని వైనం

- ఇష్టానుసారం ఇసుక డ్రెడ్జింగ్
- అధికారులకు కానరాదు
- పట్టుకున్నా కేసు నమోదు కాదు
- అధికారుల మధ్య లేని సమన్వయం
- ఆర్‌కే కనుసన్నల్లోనే దందా
- అందరికీ మామూళ్లే

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని ఓ చారిత్రక నిర్ణయం తీసుకుంటే.. సొంత పార్టీ నేతలు,అధికారులే దానికి తూట్లు పొడుస్తున్నారు.వైసీపీ హయాంలో ఇసుకను అక్రమంగా దోచేసిన దొంగలతో కుమ్మక్కవడం మరో ఘోరం. అనధికారికంగా డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక తోడేసి దోపిడీ కొనసాగిస్తున్నారు. ఉద్యోగాల భద్రత గుర్తొచ్చి అప్పుడప్పుడు టాస్క్‌ఫోర్స్ కొన్ని డ్రెడ్జింగ్ పడవలను పట్టుకుంటే.. వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఇరిగేషన్ అధికారులు, కేసులు నమోదు చేయడానికి పోలీసులు వితండవాదన చేయడం గమనార్హం.ఈ నెల 8వ తేదీన 5 డ్రెడ్జింగ్ బోట్లను పట్టుకుంటే సోమ వారం కేసు నమోదు చేయడం గమనార్హం.

గోదారిలో బోట్లు ఎన్ని?

గోదావరిలో బోటు దిగాలంటే గతంలో ఇరిగేషన్ అధికారులు లైసెన్స్ ఇచ్చేవారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో పోర్టు అధికారుల అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టింది. తనిఖీలు, లైసెన్స్‌ల అధికారం పోర్టుకే ఇచ్చింది. కానీ వాళ్లెవరూ కనీసం తనిఖీలకు రారు. ఎన్ని పడవలకు అనుమతిచ్చారో చెప్పరు. అనధికారికంగా డ్రెడ్జింగ్ బోట్లు తిరిగేస్తుంటే పట్టించుకోరు. దీంతో గోదావరిలో ఎన్నిబోట్లు ఇసుక తీస్తున్నాయో..అవి ఎవరివో కూడా లెక్కాపత్రం లేదు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బోట్లు ఇరిగేషన్ ఏఈ కస్టడిలో ఉన్న సంగతి తెలిసిందే.

సొసైటీల ముసుగులో డ్రెడ్జింగ్

అఖండ గోదావరిలో డీసిల్టేషన్‌కు ప్రభుత్వ అనుమతి ఉంది. బోట్స్‌మన్ సొసైటీల ద్వారా మాన్యువల్‌గా గోదావరి నుంచి ఇసుక తీయాలి.అందుకు బోట్స్‌మన్ సొసైటీకి టన్నుకు రూ.219 ఇస్తారు.కానీ కొందరు ఇసుక వ్యాపారులు,ప్రజా ప్రతినిధులు కుమ్మక్కయి,కొందరు అధికారులను గుప్పిట్లో పెట్టుకుని గత వైసీపీలో ఇసుక అక్రమాలు చేసి రూ.కోట్లు గడించిన ఆర్కే. అనే వ్యక్తికి మళ్లీ ఇక్కడ పెత్తనం అప్పగించారు. దీంతో బోట్స్‌మన్ సొసైటీల పేరుతో డ్రెడ్జింగ్ మొదలైంది. గుంటూరు, విజయవాడ, భీమడోలు, విజ్జేశ్వరం ప్రాంతాలకు చెందిన సుమారు 70 డ్రెడ్జింగ్ బోట్లు గోదావరిలో అక్రమ డ్రెడ్జిం గ్‌కు పాల్పడుతున్నాయి. సుమారు 3 నెలల నుంచి డ్రెడ్జింగ్ చేస్తున్నారు. సాధారణ బోట్లలో పది యూనిట్ల వరకూ ఇసుక వస్తుంది. ఒక రాత్రి డ్రెడ్జింగ్ చేస్తే వందల టన్నుల ఇసుక వచ్చేస్తుంది. దీనిని తెచ్చి బోట్స్‌మన్ సొసైటీల్లోనే అన్‌లోడ్ చేస్తున్నారు..వారికివ్వాల్సింది వారికిచ్చే స్తున్నారు.పగటి పూట లంకల్లో లేదా, కొవ్వూరు, గాయత్రి, కోటిలింగాల, కాతేరు ప్రాంతాల్లో డొంకల్లో డ్రెడ్జింగ్ పడవలను తాళ్ల తో కట్టేసి రాత్రికి మళ్లీ డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్నారు.

ఎట్టకేలకు కేసులు నమోదు

ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు టూటౌన్ పోలీసులకు అక్రమ డ్రెడ్జింగ్ బోట్ల గురించి ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ ఏఈ శివ ప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు సీఐ శివగణేష్ తెలిపారు. గాయత్రి ర్యాంపుల్లో దొరికిన ఐదు డ్రెడ్జింగ్ బోట్లపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. లలితాదేవి బోటులో ఆపరేటర్ ఘంటసాల ఏసు, బాలే రామ్మూర్తిపై కేసు నమోదైంది. శ్రీలక్ష్మీగణపతి వీరచంద్రయ్య డ్రెడ్జింగ్ బోటు యజమానిగా గుంటూరు జిల్లా ధరణికోటకు చెందిన యళ్లమూడి వెంకటరావు, శ్రీ లక్ష్మీ గణపతి డ్రెడ్జింగ్ బోటు యజమానిగా సీతంపేటకు చెందిన సంగీత వెంకటావు, సద్గురు సాయినాథ్ బోట్ యజమానిగా కొవ్వూరుకు చెందిన కొత్తపల్లి బాలాజీ, శ్రీలక్ష్మీ డ్రెడ్జింగ్ బోటు యజమానిగా యాళ్లమూడి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు అయింది. కోటిలింగాల, కాతేరులో దొరికిన డ్రెడ్జింగ్ బోట్లపై ఇంకా కేసు నమోదు కాలేదు. త్రీటౌన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో ఇక్కడ కూడా కేసు నమోదయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు యజమానులు ముందుకొస్తున్నట్టు సమాచారం.

టన్నుల కొద్దీ అవినీతి

ఈ ఇసుక వ్యవహారం అంతా ఆర్కే అనే వ్యక్తి చేతుల మీదుగా జరుగుతుంటుంది. అతని నుంచి ఎవరి వాటా వారికి వెళ్లిపోతుంది. కొందరు ప్రజాప్రతి నిధులకు 20 టన్నుల లారీకి రూ.3800 వందలు అందుతున్నట్టు ప్రచారం. ఇలా రోజుకు సుమారు 5 లక్షల వరకూ కొందరికి అందే అవకాశాన్ని సదరు ఆర్కే కల్పించినట్టు ప్రచారం ఉంది. 20 టన్నుల లారీకి సుమారు 25 నుంచి 35 టన్నుల వరకూ ఇసుక అదనంగా వేస్తున్నారు. 20 టన్నుల లారీ అంటే 20 టన్నుల ఇసుకకే బిల్లు ఉంటుంది.మిగిలి నది ఎవరికి వారు దండుకుంటున్నారు. అధికలోడు వల్ల రోడ్ల మీద ఇసుక పడిపోవడం, దుమ్ము రేగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెరవలి సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ మల్లేశ్వరం ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, అలాగే 11 కేవీ ఖండవల్లి ఫీడర్ నందు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇళ్లకు అదానీ స్మార్ట్‌మీటర్లు వద్దు



పట్టణంలో ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై పెద్దఎత్తున భారాలు మోపుతున్నాయని, దీనిపై ప్రజలు చైతన్య వంతులై తిప్పికొట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక అన్నారు. కొవ్వూరు శ్రీరాజరాజేశ్వరి రామకృష్ణనగర్‌లో మంగళవారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్ల దోపిడీపై ప్రజా చైతన్య సభ నిర్వహించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గతంలో బషీర్‌బాగ్ ఉద్యమం ప్రభావంతో అధికారం కోల్పోయిన పాలకులు మరోసారి విద్యుత్ ఉద్యమాన్ని రెచ్చగొట్టే నిర్ణయాలు చేయడం బాధాకరమన్నారు. విద్యుత్ వినియోగదారులకి నష్టం చేకూర్చే విధానాలను విడనాడాలన్నారు. గతంలో లోకేష్ పిలుపునిచ్చిన ప్రకారం స్మార్ట్‌మీటర్లను ధ్వంసం చేయాలా అని ప్రశ్నించారు. అదానీ స్మార్ట్ మీటర్లను, ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇ.గ్రీష్మకుమార్, జి.పార్వతి, బేబీరాణి, సత్య, జమీల, సుజాత, భగవాన్‌రాజు, హనీఫా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ

గోపాలపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు, పాలకులు సమన్వయంతో కృషిచేయాలని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో జీ. రాజమనోహర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది ఇంటింటా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణ, పంచాయతీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయాశాఖల మండల స్థాయి అధికారులు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలతో సమాజంలో గుర్తింపు



బౌద్ధదమ్మపీఠంలో మొక్కలు నాటుతున్న బోడే రామచంద్రయాదవ్

ఉండ్రాజవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ దమ్మపీఠం అధిపతి అనాలయో ద్వారా బుద్ధుడి బోధనలు వ్యాప్తి చెందాలని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు. మంగళవారం బౌద్ధ దమ్మపీఠానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ బుద్ధుడి బోధనల వల్ల బహుజనులకు, వెనుకబడినవారికి సమాజంలో గుర్తింపు వస్తుందని చెప్పారు. అలాగూ బుద్ధ విహార్ నిర్మాణానికి రూ. రెండు లక్షల విరాళాన్ని ప్రకటించారు. తొలుత పీఠం ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా బుద్ధుడి విగ్రహం వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం రామచంద్రయాదవ్‌కు పీఠాధిపతి అనాలయో రక్షాబంధన్ కట్టి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అక్కిన గోపాలకృష్ణ, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి పొగాకు పండించొద్దు

● పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్



దేవరపల్లిలో పొగాకును పరిశీలిస్తున్న ఛైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, జూలై15 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటను పరిమితి మేరకే పండించాలని పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థలో పొగాకు పంట నియంత్రణ ఒప్పందం పై మన దేశం కూడా సంతకం చేసిందని, దాని మేరకే పొగాకు పంటను పండించాలన్నారు. రైతులు పొగాకు పంటతో పాటు ప్రత్యామ్నాయ పంటలు వేసి పొగాకు పంటను పరిమితి మేరకే పండించుకోవాలన్నారు. ప్రపంచ దేశాల్లోని జింబాబ్వే, బ్రెజిల్ దేశాలతో పాటు టాంజినియా, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో కూడా పొగాకు ఉత్పత్తి పెరిగిందని, మన పొగాకుపై కూడా అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం ఉంటుందన్నారు. అందువల్ల నాణ్యమైన పొగాకు తక్కువ విస్తీర్ణంలో ఉత్పత్తి చేయాలని రైతులకు సూచించారు. ఈ ఏడాది 61 మిలియన్ పొగాకు పంటకు అనుమతి ఇస్తే 80 మిలియన్ కిలోలు పండించారన్నారు. వచ్చే ఏడాది 49 మిలియన్ కిలోలకే పంట అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్‌లో వెయ్యాల్సిన నాట్లు లేట్ ప్లాంటేషన్ కూడా వేశారని, అలాగే బడ్వా నేలల్లో, నల్ల నేలల్లో వర్జీనియా పొగాకు పండించటం వల్ల నాణ్యత కోల్పోతుందన్నారు. దాని ప్రభావం మన పొగాకుపై పడుతోంద న్నారు. గత ఏడాది పొగాకు అదనపు పంట పై సెస్ లేకుండా 124 కోట్లు రైతులకు లబ్ధి చేకూ రిందని, ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదన్నారు. గత ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల అదనపు పంటపై రుసుము పెనాల్టీ లేకుం డా చేశారని తెలిపారు. ఈ ఏడాది పొగాకు అమ్మకాలు ప్రారంభంలో రేట్లు ఆశాజనకంగా లేకపోవడంతో రోజురోజుకు రేట్లు పెరగటంతో ఆశాజనకంగా పొగాకు ధరలున్నాయి. ఈ పొగాకు అమ్మకాలు సెప్టెంబర్ నెలాఖరుకు అమ్మకాలు పూర్తిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్, దేవరపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి హేమ స్మిత, రైతుసంఘం నాయకులు కరుటూరి శ్రీనివాసరావు, కాట్రు వీరవెంకట సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, రైతులు యాగంటి వెంకటేశ్వరరావు, బిక్కిన నాగరాజు, యగంటి సాయిబాబు, పరిమి శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి : ఎమ్మెల్యే



కుమారదేవంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



పడమర చోడవరంలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

కొవ్వూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కుమారదేవంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారన్నారు. అలాగే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రవితేజకు రూ. 58,000, శ్రీరంగం వెంకటలక్ష్మికి రూ. 44,319 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మండల అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, కుమారదేవం పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడు గొరిజాల సురేష్, ఇంజవరపు చంద్రబాబు, గన్నమని భాస్కరరావు, సుంకవల్లి వెంకటేశ్వరరావు, చావా శ్రీనివాస్, గొరిజాల శ్రీనివాసరావు, బోగవల్లి శేషగిరి,తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: కూటమి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం తూర్పు, పడమర చోడవరం, తెలికిచర్ల, గుండేపల్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలియజేశారు. దీనిలో భాగంగా తూర్పుచోడవరంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. తర్వాత అక్కడకు చేరుకున్న రైతులతో మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలో 447 కుటుంబాలకు రూ. నాలుగు కోట్ల 30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్ యర్ధన పూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, కూచిపూడి ఉదయభాస్కరరావు, తూర్పు చోడవ రం సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ ఉండ వల్లి గోపి, పార్టీ మండల అధ్యక్షుడు ఉండవల్లి అనుదీప్ ,పడమర చోడవరం సర్పంచ్ పెండ్యాల హిమబిందు, చందు, టీడీపీ సీనియర్ నేత మద్ది పాటి సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు అలపాటి శ్రీరామచంద్రమూర్తి, వేగేస్ని శ్రీనివాస రాజు, ఉప్పు నరేష్, తెలికిచర్లలో సుంకర సుబ్బారావు, ప్రతాప్, జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, రుద్ర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: ఊనగట్లలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా ముళ్లపూడి శారదకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కు రూ.70,104 అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ నేతలు బొల్లిన శివ నాగేంద్ర, నందిగం శ్రీనివాసరావు, వీరవల్లి సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఊనగట్లలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.1,96,959 లక్షలు



అమ్మవారి హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో వేంచేసి ఉన్న గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. సుమారు 128 రోజులకు గాను రూ. 1,96,959 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బీఎల్ లక్ష్మీనరసింహారావు, ఆలయఅర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నటి సరోజినీదేవి మృతి బాధాకరం

కొవ్వూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సినీ కళారంగానికి బి.సరోజినీదేవి వన్నె తీసుకువచ్చారని, ఆమె మృతి బాధాకరమని ఏఎన్ఆర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే రంగారావు అన్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో సుమారు 200లకు పైగా చిత్రాల్లో నటించారన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ తోపాటు రామచంద్రన్, శివాజీ గణేషన్, కన్నడంలో రాజ్‌కుమార్, హిందీలో దిలీప్, రాజ్‌కుమార్ సరసన నటించి మెప్పించారన్నారు. తెలుగులో శ్రీకృష్ణార్జున యుద్ధం, అమరశిల్పి జక్కన్న, ఆత్మబలం, శ్రీరామాంజనేయ యుద్ధం, సీతారామ కల్యాణం, దానవీరశూర కర్ణ, భూకైలాస్, పెళ్లికానుక, రహస్యం, మంచి, చెడు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

● ఎస్ఐ రవికుమార్

ఉండ్రాజవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్ఐ డి. రవికుమార్ సూచించారు. మంగళవారం ఉండ్రాజవరం-తణుకు రోడ్డులోని పాలంగి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తమ వద్ద లైసెన్స్, హెల్మెట్ లేకపోయినా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మద్దిపాటి



కూరుకూరులో సొసైటీ ఛైర్‌పర్సన్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, హాజరైన తదితరులు

దేవరపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు మరింత తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. కూరుకూరులో మంగళవారం కురుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడు తూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేసిన ఘనత మన ప్రభుత్వా నికే దక్కుతుందన్నారు. రూ. 218 కోట్లతో నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అలాగే మన నియోజకవర్గంలో నెలకు రూ.18 కోట్లు పింఛన్లు ఇవ్వడం జరు గుతోందన్నారు. రైతులకు సొసైటీల ద్వారా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, సబ్సిడీ పై అందించటం జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉన్నాయని, ప్రతి సొసైటీ లాభ సాటిగా ఉండేవిధంగా అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ఛైర్‌పర్స న్లు కృషి చేయాలన్నారు. అనంతరం కురుకూరు సొసైటీ ఛైర్‌పర్సన్‌గా యలమాటి భాస్కరరావు, ఛైర్‌పర్సన్ బొల్లం నాగేశ్వరరావు, నూతలపాటి గాంధీతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎంపికైన భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీగా మంజూరైన రూ. నాలుగు లక్షల 40 వేలను అనుమతి ఇస్తూ మొదటి సంతకం చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చినబాబు, మాజీ జడ్పీటీసీ కొయ్యలమూడి సుధారాణి, టీడీపీ నేతలు కొయ్యలమూడి గాంధీ, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, పెనుమత్స సుబ్బరాజు, గ్రామ సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, టీడీపీ నేతలు బళ్లా సూర్యచక్రం, మల్లెల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శేషారావు జన్మదిన వేడుకలు



వేలివెన్నులో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉండ్రాజవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు జన్మదిన వేడుకలను వేలివెన్నులో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శేషారావు గ్రామంలో అందుబాటులో లేకపోయినప్పటికీ వేడుకలు జరిపారు. గ్రామ సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, పెరవలి వాటర్‌డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శేషారావు అభిమానులు పాల్గొన్నారు.

చిలకపాడు ఉపాధ్యాయుడిపై విచారణ



విచారణ జరుపుతున్న డీవైఈవో మురళీసత్యనారాయణ

ఉండ్రాజవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చిలకపాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన టీచర్ రామచంద్రరావు సరిగ్గా పాఠశాలకు హాజరుకాకుండా వ్యాపారాలు, సొంత పనులు చేసుకుంటున్నట్టు గ్రామస్థుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం తణుకు డీవైఈవో సత్యనారాయణరాజు విచారణ చేపట్టగా, ఆరోపణ సరైందని ఆయన పేర్కొన్నారు. అయితే రామచంద్రరావుపై వచ్చిన ఆరోపణపై విచారణ జరపగా తమకు సరియైన ఆధారాలు లభించలేదని నరసాపురం డీవోఈవో డి. మురళీ సత్యనారాయణ తెలిపారు. టీచర్‌కి మొదటి హెచ్చరిక జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఎంఈవో సక్సేనరాజు, శారదాజ్యోత్స్న పాల్గొన్నారు.

కోర్ట్‌ను తప్పుదారి పట్టించిన ఇద్దరికి ఆరు నెలల జైలు

● 2005 నాటి కేసులో తీర్పు వెల్లడి.. నిందితులు విశాఖపట్నం వాసులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో కోర్టును తప్పుదారి పట్టించిన ఇద్దరు వ్యక్తులకు ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రమ్య చావలి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2005లో విశాఖపట్నంలోని శాంతినగరానికి చెందిన సింగవరపు శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాస్‌ల ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బొల్లా ఈశ్వరరావుపై ఏసీబీ రాజమండ్రి వారు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సమయంలో ఫిర్యాదుదారులు ఇద్దరు తప్పుడు సాక్ష్యం చెప్పడాన్ని కోర్టు గుర్తించింది. ఈ మేరకు ఏసీబీ జడ్జి ఇచ్చిన ఆదేశాలతో ఈ కేసును 3వ అదనపు ఫస్ట్ క్లాస్ కోర్టులో నమోదు చేసి విచారణ జరుపగా నేరం రుజువు కావడంతో సింగవరపు శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాస్‌లకు ఆరు నెలల జైలు శిక్ష, ఐదువేల జరిమాన విధించారు. జరిమాన చెల్లించకపోతే మరో రెండు నెలల పాటు జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి రమ్య చావాలి తీర్పును వెల్లడించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ను ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

హ్యాట్సాఫ్ .. డ్రైవర్!

●ఎగ ఊపిరితో బాధపడుతున్న కండక్టర్ గణేష్

● గమనించి ఆర్టీసీ బస్సునే అంబులెన్స్‌గా చేసి ఆసుపత్రికి తరలింపు

●కండక్టర్ ప్రాణాలు కాపాడిన డ్రైవర్ కుమార్‌కు తోటి సిబ్బంది అభినందనలు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ గణేష్, పక్కన ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైద్యో నారాయణో హరిః అంటారు.. ఎందుకంటే ప్రాణాలు నిలిపేవాడు వైద్యుడు.. ఆయన దేవుడితో సమానమని అర్థం. అయితే.. మంగళవారం జరిగిన సంఘటన చూస్తే డ్రైవరో నారాయణో హరిః అనాలేమో!. తక్షణం స్పందించిన ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ ఊపిరిని టాప్ గేర్‌లో నిలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం-సీతానగరం, పురుషోత్తపట్నం షటిల్ సర్వీసు బస్సు నడుస్తోంది. దానికి గణేష్ కండక్టరు కాగా.. డ్రైవర్‌గా కాటవరానికి చెందిన యూఎస్ కుమార్ ఉన్నారు. ఎండ మండిపోతున్నా.. మంగళవారం నాలుగు ట్రిప్పులు వేశారు. ఐదో ట్రిప్పు వెళ్లి బుధవారం ఉదయం మొదటి బస్సుగా పురుషోత్తపట్నం నుంచి రావాల్సి ఉంది. అయితే, నాలుగో ట్రిప్పుగా గోకవరం బస్టాండుకు వచ్చిన తర్వాత తిరిగి వెళ్లడానికి ఒక గంట సమయం ఉంది. ఈలోపు బస్సులోనే ఉన్న గణేశ్ ఎగఊపిరితో ఆందోళన పడుతున్నాడు. గుండెపై చేయి వేసుకొని తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇది గమనించిన డ్రైవర్ కుమార్ అంబులెన్స్ కోసం ఎదురు చూడలేదు.. తన పై అధికారి (ఆర్టీసీ సీఐ)కి ఫోన్ చేశారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమని ఆదేశించడంతో బస్సును టాప్ గేర్‌లో ప్రభుత్వాస్పతికి తీసుకొచ్చారు. అంతే వేగంతో స్పందించిన డాక్టర్ భారతి ఆయన్ని పరీక్షించి ఈసీజీ, తదితర వైద్యపరీక్షలు చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పడంతో తోటి సిబ్బంది అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే.. ఎండలు మండిపోతున్న వేళ కనీస విశ్రాంతి లేకుండా బస్సులు తిప్పడంతో సిబ్బంది ప్రాణాలపైకి వస్తోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. రెండేళ్ల క్రితం ఇలాగే ఒక డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో నేరుగా ప్రభుత్వాస్పత్రికి బస్సును నడిపించారు. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వ్యవహరించడంతో ఆయనకు. ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఆర్టీసీ సిబ్బంది నిబంధనల ప్రకారం వైద్యప రీక్షలు నిర్వహిం చకపోవడంతో ఇలాంటి తీవ్రమైన సమస్యలు వస్తున్నట్టుగా తెలుస్తోంది.

బీసీ, ఎస్సీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఎస్సీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంక్షేమ వసతిగృహాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 22 ఎస్సీ హాస్టళ్లకు సంబంధించి పలు హాస్టళ్లలో మరమ్మతు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మొత్తం రూ.3 కోట్ల 78 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో మైనర్ రిపేర్లకు రూ.2.10 కోట్లు, మేజర్ రిపేర్లకు రూ.1.67 కోట్లు కేటాయించామని తెలిపారు. అలాగే జిల్లా 23 బీసీ హాస్టళ్లకు సంబంధించి ఐదు హాస్టళ్లలో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడించారు. వై.జంక్షన్‌లోని బాలుర హాస్టల్‌లో రూ.30 లక్షలతో శాశ్వత డైనింగ్ హాల్ నిర్మించడం జరుగుతున్నదని అన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి మహ్మద్ ఘయాజుద్దీన్, బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

'ఉద్యోగం పొందినవారు క్రమశిక్షణతో పనిచేయాలి'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పొందిన వారు క్రమశిక్షణతో పనిచేయాలని కలెక్టర్ పీ. ప్రశాంతి అన్నారు. మంగళవారం కారుణ్య నియామకం పొందిన ముగ్గురికి నియమక పత్రాలను అం దించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముగ్గురిలో ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్‌లు, ఒకరికి పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా నియమక పత్రాలు అందించామన్నారు. నూతనంగా ఉద్యో గాల్లోకి ప్రవేశించిన ఈ ముగ్గురు సీనియర్ల వద్ద మెళకువలు నేర్చుకుని సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీఎం రామలింగేశ్వర్, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, తదితరులు పాల్గొన్నారు.